thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 100 | జగిత్యాల గురువారం 09 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

76 పరుగులకు కుప్పకూలిన టీమిండియా



11

## నీట్-యూజీసీ సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్



### ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు

నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

2

## యూట్యూబ్ చూసి వైన్ తయారీ

- స్వయం ఉపాధికి వృద్ధుడి అక్రమ మార్గం
- ఏడాదిగా ఇంట్లోనే వైన్ తయారీతో ధనార్జన
- దాడిచేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

2

ఇంట్లోనే అక్రమంగా వైన్ తాయరు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూట్యూబ్ వేదికగా వైన్ తయారీ నేర్చుకుని, ఇంట్లోనే అక్రమంగా వైన్ తయారు చేస్తున్న ఓ వృద్ధుడి గుట్టును మల్కాజ్‌గిరి డీటీఎఫ్ పోలీసులు రట్టు చేశారు. వృద్ధాప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషించే క్రమంలో ఈ అక్రమ దందాకు తెరలేపిన ఆంటోనీ పీటర్ అనే వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు.



## ఖమ్మంలో రూ.300 కోట్ల ఆయిల్ పామ్ కాంప్లెక్స్

- గోద్రెజ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు
- 700 మందికి ఉపాధి..
- ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ మద్దతు

2వ పేజీలో..





## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి

### సీఎం రేవంత్‌తో కెనడా హైకమిషనర్ కీలక భేటీ

- మెట్రో, ఫ్యూచర్ సిటీ, హరిత ఆర్థిక వ్యవస్థపై చర్చలు
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు ఆహ్వానం

కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణల బలోపేతంపై కీలక చర్చలు జరిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, ప్రతిపాదిత 'ఫ్యూచర్ సిటీ' వంటి మెగా ప్రాజెక్టులలో భాగస్వామ్యం, హరిత ఆర్థిక వ్యవస్థ (గ్రీన్ ఎకానమీ), సౌర విద్యుత్ రంగాలలో కెనడా సహకారంపై సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు.

- హైదరాబాద్, జూలై 8

2లో

## ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి
- బీజేపీ నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ



ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తున్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బుధవారం కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నాయకులతో కలిసి కలిసిన అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై కట్టుకథలు

- నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా
- గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం
- కేటీఆర్



కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఇంకా కట్టుకథలు చెబుతూ కాలక్షేపం చేస్తోందని, రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయ కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గోదావరిలో లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుండగా, మరోవైపు రైతులు నీటి కోసం అల్లాడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు.

3

## చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడంలేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో మాజీమంత్రి హరీష్ రావు

3





4

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

- ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం
- ఏపీ, తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- డిజిటల్ పరికరాలు స్వాధీనం

## దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా

నా అధికారలేంటో నాకు తెలియదా

కొండా సురేఖ వ్యవహారంపై కడియం

3



## పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి



- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ఇరాన్ ప్రతిదాడి
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు

4

## సౌదీలో చిక్కుకున్న యువకుడు

- స్వదేశానికి రప్పించాలని హైకోర్టులో తల్లి రిట్
- నేడు 9న విచారణ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసుల అవకాశం

2



# నీట్-యూజీసీ సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

## ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు



**న్యూఢిల్లీ, జూలై 8:** నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మ-రోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

# యూట్యూబ్ చూసి వైన్ తయారీ

## స్వయం ఉపాధికి వృద్ధుడి అక్రమ మార్గం

## ఏడాదిగా ఇంట్లోనే వైన్ తయారీతో ధనార్జన

## దాడిచేసి పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు



**హైదరాబాద్, జూలై 8:** ఇంట్లోనే అక్రమంగా వైన్ తాయరు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూట్యూబ్ వేదికగా వైన్ తయారీ నేర్చుకుని, ఇంట్లోనే అక్రమంగా వైన్ తయారు చేస్తున్న ఓ వృద్ధుడి గుట్టును మల్కాజ్‌గిరి డీటీఎఫ్ పోలీసులు రట్టు చేశారు. వృద్ధాప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషించే క్రమంలో ఈ అక్రమ దందాకు తెరలేపిన ఆంటోనీ పీటర్ అనే వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి డీటీఎఫ్ సీఐ భరత్ కుమార్, ఎస్సై శ్రీనివాసరెడ్డి, సిబ్బంది కలిసి ఉమ్మడిగా ఈ దాడులు నిర్వహించారు. నిందితుడు ఆంటోనీ పీటర్ గత ఏడాది కాలంగా ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఏడు రకాల ఫ్లేవర్లలో వైన్ తయారు చేస్తూ, 750 ఎంఎల్ బాటిల్‌ను రూ. 300 చొప్పున విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నట్లు డీటీఎఫ్ సీఐ వెల్లడించారు. గ్రేప్స్ (ద్రాక్ష), పైనాపిల్, జామ, మోసంబి, సపోటా, బనానాలతో పాటు ఆఖరికి తమలపాకు ఫ్లేవర్‌తో కూడా ఇతడు వైన్ తయారు చేస్తుండటం గమనార్హం. వివిధ రకాల పండ్లను దాదాపు 15 రోజుల పాటు సహజ సిద్ధంగా ఫార్మెంటింగ్ (పులియబెట్టడం) చేసి.. ఆ రసంలో పంచదార, గోధుమలు కలిపి వడకట్టి వైన్‌గా మారుస్తున్నాడు. పండ్లను 15 రోజుల పాటు పులియబెట్టడం వల్ల ఆ రసంతో పాటు సహజంగానే అందులో ఆల్కహాల్ శాతం కూడా వస్తుందని అధికారులు తెలిపారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్ పరీక్షలు లేకుండా తయారు చేసిన వైన్‌ను నిందితుడు నేరేడ్‌మెట్, సికింద్రాబాద్, కాప్రా పరిసర ప్రాంతాల్లోని కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ఆకస్మిక దాడిలో అధికారులు నిందితుడి వద్ద నుంచి సుమారు 377.7 లీటర్ల వైన్‌ను, దాన్ని ప్యాక్ చేయడానికి సిద్ధంగా ఉంచిన 502 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ అక్రమ వైన్ నిల్వల విలువ మార్కెట్లో సుమారు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఎక్సైజ్ శాఖ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ఈ వైన్ తయారీ వ్యవహారాన్ని చాకచక్యంగా ఛేదించిన డీటీఎఫ్ బృందాన్ని మల్కాజ్‌గిరి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ప్రణవి, ఈఎస్ బి. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వైన్ నిల్వలతో పాటు నిందితుడు ఆంటోనీ పీటర్‌ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాప్రా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి

- సీఎం రేవంత్‌తో కెనడా హైకమిషనర్ కీలక భేటీ
- మెట్రో, ఫ్యూచర్ సిటీ, హరిత ఆర్థిక వ్యవస్థపై చర్చలు
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు ఆహ్వానం



**హైదరాబాద్, జూలై 8:** తెలంగాణలో పెట్టుబడుల విస్తరణపై కెనడా ఆసక్తి వ్యక్తం చేసింది. కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. ఈ సందర్భంగా మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ, హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో భాగస్వామ్యంపై ఇరు పక్షాలు చర్చించాయి. ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని సీఎం వివరించారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా సంస్థలను ఆహ్వానించిన ముఖ్యమంత్రి, హైదరాబాద్‌లో కెనడా విశ్వవిద్యాలయాల బహుళ క్యాంపస్‌ల ఏర్పాటును ప్రతిపాదించారు. తెలంగాణ ప్రతినిధి బృందం కెనడాలో పర్యటించాలని కెనడా హైకమిషనర్ ఆహ్వానించారు. తెలంగాణపై కెనడా సంస్థలకు విశ్వాసం పెరుగుతోందని క్రిస్ కూటర్ పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ముందంజలో ఉందని ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, రక్షణ రంగాల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం త్వరలో తెలంగాణను సందర్శించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.



# ఖమ్మంలో రూ.300 కోట్ల ఆయిల్‌పామ్ కాంప్లెక్స్

## గోద్రెజ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు

## ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ మద్దతు

**హైదరాబాద్, జూలై 8:** తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్‌ను ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్, గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. దీనివల్ల 700 మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు నర్సరీ, పరిశోధన కేంద్రం, విత్తన ఉద్యానవనం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 113.5 ఎకరాల భూమిని కేటాయించింది. విత్తన ఉద్యానవనం కోసం మరో 35 నుంచి 40 ఎకరాల భూమి కేటాయించాలని గోద్రెజ్ ప్రతినిధులు కోరగా, ప్రాసెసింగ్ మిల్లుకు వెళ్లే రహదారి విస్తరణపై కూడా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రహదారి విస్తరణ పనులను టీజీఐఐసీ ద్వారా చేపట్టాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు.

# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం
- 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు
- మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, జూలై 8:** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ÷ళ్లను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3 తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయ కుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.

# సౌదీలో చిక్కుకున్న యువకుడు

- స్వదేశానికి రప్పించాలని హైకోర్టులో తల్లి రిట్
- నేడు విచారణ.. ప్రభుత్వాలకు నోటీసుల అవకాశం



**జగిత్యాల, జూలై 8:** సౌదీ అరేబియా ఎడారిలో గొర్రెల కాపరిగా బలవంతంగా పనిచేయిస్తున్న తన కుమారుడు దాసరి అరవింద్‌ను వెంటనే రక్షించి స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ ఆయన తల్లి దాసరి రాజవ్వ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం బీబీ రాజ్‌పల్లి గ్రామానికి చెందిన అరవింద్ తరఫున హైకోర్టు న్యాయవాది మాదాసు భరత్ చంద్ర 'రిట్ ఆఫ్ మాండమస్' పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం జూలై 9న విచారణ చేపట్టనుంది. పిటిషన్‌లో కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి, ప్రొటెక్టర్ జనరల్ ఆఫ్ ఎమిగ్రెంట్స్, సౌదీ అరేబియాలోని భారత రాయబారి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ (ఎన్నారై) ముఖ్య కార్యదర్శి, తెలంగాణ డీజీపీ, జగిత్యాల జిల్ ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, సౌదీ అరేబియాలో ప్యాకింగ్ వర్కర్ ఉద్యోగం ఇప్పిస్తామని స్థానిక గల్ఫ్ ఏజెంట్ హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు రూ.90 వేల వరకు చెల్లించారు. అనంతరం అరవింద్ ఈ ఏడాది ఫిబ్రవరి 15న సౌదీ అరేబియాకు వెళ్లాడు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత వాగ్దానం చేసిన ఉద్యోగం ఇవ్వకుండా, రియాద్‌కు సుమారు 950 కిలోమీటర్ల దూరంలోని ఎడారి ప్రాంతంలో గొర్రెల కాపరిగా బలవంతంగా పనిచేయిస్తున్నారని ఆరోపించారు. అరవింద్‌కు సరైన ఆహారం, తాగునీరు, వసతి, వైద్య సదుపాయాలు కల్పించకుండా అమానుష పరిస్థితుల్లో పనిచేయిస్తున్నారని, కుటుంబ సభ్యులతో సంబంధాలు తెంచేందుకు అతని మె-బైల్ సిమ్‌ను స్వాధీనం చేసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. స్వదేశానికి తిరిగి వచ్చే స్వేచ్ఛ కూడా లేకపోవడంతో అతని ప్రాణ భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. ఇదివరకే తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో మే 8న 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో బాధితుడి తల్లి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రియాద్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాయగా, సంబంధిత గల్ఫ్ ఏజెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే హైదరాబాద్‌లోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ కార్యాలయం ద్వారా ముంబైలోని రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెన్సీకి నోటీసులు కూడా జారీ చేసినప్పటికీ, రెండు నెలలు గడిచినా ఫలితం లేకపోవడంతో చివరకు హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

# నేడు హైదరాబాద్‌కు జెపి నడ్డా

## ఎయిమ్స్‌పై సమీక్షించనున్న మంత్రి



**హైదరాబాద్, జూలై 8:** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించ నున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. గురువారం ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

చురకలు



# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు



- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు
- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- తుమ్మిడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, జూలై 8:** గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటార్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు. మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్డీఎస్ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై కట్టుకథలు

- రైతుల గోస తీర్చాల్సిందే: కేటీఆర్
- మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నా ఎత్తిపోయరా?
- తెలంగాణ 'సంపన్న రాష్ట్రం' అంటూ ప్రపంచ బ్యాంక్ నివేదిక : ఎక్స్ వేదికగా హర్షం



**హైదరాబాద్, జూలై 8 :** ఒకపక్క నీళ్లు లేక గ్రామాల్లో రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. మరోపక్క మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా సముద్రం పాలు కావడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో రోమ్ నగరం తగలబడుతుంటే ఫ్లూటు వాయించిన నీరో చక్రవర్తిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మించిపోయిందని మండిపడ్డారు. కేసీఆర్ మీద ఉన్న కక్షతో అన్నం పెట్టే రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం శిక్ష వేస్తోందని ధ్వజమెత్తారు. "ఎల్‌నినో ముప్పు ముంచుకొస్తున్నా ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారు? ముఖ్యమంత్రికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా?" అని కేటీఆర్ నిలదీశారు. మీ పగలు, ప్రతీకారాలు ఏవైనా ఉంటే ప్రతిపక్షం మీద తీర్చుకోవాలి కానీ, అమాయక రైతులను ఆగం చేయవద్దని హితవు పలికారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా, పొలాలను ఎండబెడుతున్న కాంగ్రెస్ కర్కశ పాలనను తెలంగాణ రైతాంగం గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఎక్కడా చుక్క నీరు లేని కరవు కాలంలోనూ కాళేశ్వరమే ప్రాణేశ్వరమై కాపాడుతుందని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. వానల్లేక, ఎవుసం సాగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం దగ్గర పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి రైతుల గోస తీర్చాలన్న కనీస సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. లోటు వర్షపాతంతో రాష్ట్రంలో నాట్లు పడక, విత్తనాలు వేయక పంటలు సాగుచేసే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వమేమో ఏమీ పట్టించుకోకుండా దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. తక్షణమే కన్నెపల్లి పంప్ హౌజ్ మోటర్లను నడిపించి, రాబోయే కరువు నుంచి తెలంగాణను కాపాడుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ప్రపంచ బ్యాంక్ నివేదికపై కేటీఆర్ హర్ష

తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటిన సంపన్న రాష్ట్రమంటూ ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో వెల్లడించడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' (ట్విట్టర్)లో స్పందించారు. దేశంలో ఈ అరుదైన హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాలలో తెలంగాణ నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాలేదని.. సఫల, సంపన్న రాష్ట్రమై దేశంలోనే సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలు గర్వించే సందర్భం ఇది. సాధించుకున్న స్వరాష్ట్రం కేసీఆర్ దార్శనిక పాలనలో సంపన్న రాష్ట్రంగా అవతరించింది. తమ చెమటను, నైపుణ్యాన్ని, మేధస్సును రంగరించి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ శుభాభివందనాలు" అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ వస్తే ఏమొచ్చిందన్న వారికి.. ఇక్కడి జాతి సంపద పెరిగిందని, జనం ఆదాయం అద్భుతంగా వృద్ధి చెందిందని ఈ నివేదికే సమాధానం చెబుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధి చెందిందని జాతీయ నివేదికలే కాకుండా, అంతర్జాతీయ సంస్థలు కూడా తేల్చి చెబుతున్నాయన్నారు. తెలంగాణను దివాలా రాష్ట్రం అంటూ కాంగ్రెస్ చేస్తున్న దిక్కుమాలిన ప్రచారాలకు ప్రపంచ బ్యాంకు తాజా నివేదికే చెంపపెట్టు అని కేటీఆర్ తన పోస్ట్‌లో స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి
- బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ



**న్యూఢిల్లీ, జూలై 8:** ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు. బుధవారం కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతుగోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి ఈఅఎకి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. 2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఈఅఎకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారిం చారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఔఅఆఅ ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ- 2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేందప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఓ÷ూఖ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఓ÷ూఖ ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34891 కోట్లని తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.



# దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా

## నా అధికారలేంటో నాకు తెలియదా

## కొండా సురేఖ వ్యవహారంపై కడియం

**జనగామ, జూలై 8:** తాను ఎక్కడా దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షలు చేయడం కానీ, మంత్రి కొండా సురేఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కానీ చేయలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జిల్లా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఏఐసీసీకి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'నేను ఏ తప్పు చేయలేదు.. వివరణ ఎందుకు ఇస్తా' అని అన్నారు. ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశానని చెప్పారు. అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, సమస్యలు మాత్రమే విన్నవించినట్లు వివరించారు. దేవదాయ శాఖలో నిధులు లేవంటే... నియోజకవర్గం లోని ఆలయాల సమస్యల పరిష్కారానికి ఎస్టిమేషన్‌లను మాత్రమే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదని తెలుసన్నారు. ఇదంతా అవగాహన లోపంతోనే జరుగు తోందన్నారు. కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారని.. కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ ప్రజల మధ్యలో ఉండాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం.. మంత్రులను అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని చెప్పారు. ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కమిషనర్‌ను కలిసినట్లు కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

# భీమ్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

## 300 కోట్లకు పైగానే ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు

## బినామీల పేరున ఆస్తులు.. ముందే క్యాన్సిలేషన్ డీడ్‌లు

**హైదరాబాద్, జూలై 8:** ఏసీబీకి చిక్కిన డీఎస్పీ భీమ్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నుంచి రెండు మెమరీ కార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.300 కోట్లపైన ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉంటున్న విల్లా ఎలా కొన్నారనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. మెమరీ కార్డులు, డైరీల ద్వారా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. మెమరీ కార్డులోని వివరాల ఆధారంగా ఆస్తుల డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. 'నాకు ఇవ్వాల్సిన వాళ్లు, నేను ఇవ్వాల్సినవి' అంటూ డీఎస్పీ భీమ్‌రెడ్డి తన డైరీలో రాసుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. బినామీలు ఎప్పుడైనా తిరగబడే ప్రమాదం ఉందని ఆయన ముందే ఊహించాడని అన్నారు. అక్రమాస్తులు కూడపెట్టడంలో భీమ్‌రెడ్డి చాలా తెలివిగా వ్యవహరించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆస్తులను బినామీ పేర్ల మీద రిజిస్ట్రేన్ చేయించారని అన్నారు. బినామీల దగ్గర నుంచి క్యాన్సిలేషన్ డీడ్‌లను ముందే రాయించుకున్నాడని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# వరుసగా మూడరోజూ కమిటీ భేటీ

## వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులతో చర్చ

**హైదరాబాద్, జూలై 8 :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారుల గుర్తింపు, వారి సంక్షేమమే ఆశయంగా ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ అధికారిక సమావేశాలు 'తెలంగాణ అమర జ్యోతి' ప్రాంగణంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సంప్రదింపుల ప్రక్రియ బుధవారానికి విజయవంతంగా 3వ రోజుకు చేరుకుంది. కమిటీ గౌరవ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన, కమిటీ సభ్యులు సమక్షంలో ష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులు మరియు అధ్యాపక ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈనాటి కీలక సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ , తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ , తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మరియు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన మలిదశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు కమిటీ ముందు తమ ఆకాంక్షలను, విలువైన సలహాలను ఉంచారు. ఉద్యమకారులను కేవలం రాజకీయాల కోణంలో కాకుండా పారదర్శకంగా గుర్తించాలని కోరారు. ముఖ్యంగా, కేవలం ఐడెంటిటీ కార్డుల జారీతో సరిపెట్టకుండా, ఉద్యమ సమయంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి విద్యా, వైద్య, ఆర్థిక రంగాల్లో విప్లవాత్మకమైన 'సామాజిక సంస్కరణలు' తీసుకురావాలని, తద్వారా ఆయా కుటుంబాలకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. 'తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారథులు మన విద్యార్థులు మరియు మేధావులు. 3వ రోజు ముమ్మరంగా జరిగిన ఈ సమావేశాలలో వివిధ వర్సిటీల నుండి వచ్చిన ప్రతినిధులు అత్యంత విలువైన ప్రతిపాదనలను, సామాజిక సంస్కరణల విజ్ఞాపనలను కమిటీకి అందించారని చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, నిఖార్సైన ప్రతి ఒక్క ఉద్యమకారుడిని గుర్తించి, గౌరవించడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఈ రోజు సేకరించిన అన్ని నివేదికలను మరియు సామాజిక భద్రతా ప్రతిపాదనలను త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. ఉద్యమకారుల త్యాగాలకు తగిన న్యాయం జరిగేలా కమిటీ తుది నివేదికను పారదర్శకంగా సిద్ధం చేస్తుందని అన్నారు.



# కాళేశ్వరం కథ.. కంచికి చేరేదెలా?

**రాజకీయ ఆరోపణలతో కాలం గడిచింది... ఇప్పుడు పరిష్కారమే ముఖ్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎడతెగని పంచాయితీతో నష్టపోతున్నది రాష్ట్రప్రజలే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య పంచాయితీ కారణంగా నీటిని కోల్పోతున్నాం. ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునేలా చేసుకుని ముందుకు సాగడమే ఉత్తమం. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్ట్ అంటూ ప్రజాధనం వృధాచేయడం ఎంతమాత్రం సరికాదు. మేడిగడ్డ రిజర్వాయర్‌ను బాగు చేసుకోవడం, నీటిని వాడుకోవడం మినహా మరో గత్యంతరం లేదు. నిజానికి ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కన్నా మించి ఖర్చు చేశారన్నది వాదన. అందుకు సంబంధించి మాత్రమే విచారణ సాగాలి. నిధులు దుర్వినియోగం జరిగితే నిలదీయాలి. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ముందుకు సాగాలి. దీన్ని ఇంకా తవ్వుతూ పోవడం వల్ల ఉపయోగం ఉండదన్నది గత రెండున్నరేళ్లుగా చూస్తున్నాం. నది తప్పు అంటే ..నీది తప్పు అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శించుకుంటూ..ఇది వారిద్దరి గొడవగా మార్చారు. ఇది ప్రజల సమస్య. తెలంగాణ ప్రజల సమస్య. ఖర్చు పెట్టిన డబ్బుకు న్యాయం చేయడం ముఖ్యం. అలాగే అవినీతి జరిగితే దానిపై పోరాడాలి. రెండున్నరేళ్లు గడిచినా ఇంచుమందం కూడా చర్య తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఉపయోగించుకునేందుకు ఏంచేస్తే మంచిదో అదే చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలతో కాలం వృధా చేయరాదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరినా ఆయన సమాధానం చెప్పడని తేలిపోయింది. అసెంబ్లీలో గతంలోనూ చర్చ సాగింది. మరిన్ని చర్చలు చేయాలనుకోవడం సరికాదు. చర్చ కేవలం అవినీతిపైనే జరగాలి. కాళేశ్వరంలో ఎంతమేర అవినీతి జరిగిందన్నదే ముఖ్యం. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, రావడానికి కెసిఆర్ సిద్దంగా లేరు. ఇది జరగమెరిగిన సత్యం. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ అన్నది, అవినీతిపైనే సాగితే మంచిది. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను చేపట్టాలి. అలా చేసినా ఉపయోగామా లేదా అన్నది ఆలోచన చేయాలి. లక్షకోట్లను ఖర్చు చేశారు కనుక దానితో నీటిని ఉపయోగిం చుకునే శక్తి ఉంటుందా లేద అన్నది నిపుణులతో చర్చించాలి. కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారింది. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని నిపుణుల కమిటీ చెప్పిందంటున్న సిఎం రేవంత్, దానిని ఎలా వయబుల్ చేస్తారో ప్రజలకు తెలియ చేయాలి. అంతే తప్ప మళ్లీ తుమ్మడిహట్టి అంటూ ప్రజలను మరోమారు ప్రాజెక్టుల పేరుతో ముంచరాదు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కాంగ్రెస్ చిత్తశుద్దిని చాటుకోవాలి. కాళేశ్వరంలో ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని అంటున్నారు. భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అది నిజమే అయితే న ఇపుణుల కమిటీ నివేదికలను బయటపెట్టాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాక వేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని సిఎం రేవంత్ అంటున్నారు. ఇదే సందర్భంలో అప్పులను తగ్గించుకోవడం, ఉచిత పథకాలను సమీక్షించడం కూడా చేయాలి. అదేపనిగా అప్పులు చేస్తూ పోతే రాష్ట్రం భరించే శక్తి కోల్పోతుందని గుర్తించాలి. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెబుతున్న రేవంత్ రెడ్డి ముందుగా ఆ పని చేయాలి. ఇప్పటికే ఎల్‌నినో వల్ల వర్షాలు వెనక్కి పోయాయి. గోదావరిలో ఇప్పుడే కొద్దిగా న ఈరు వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నీరు వస్తోంది. దీనిని ఒడిసి పట్టుకుని చెరువులు, ప్రాజెక్టులు నింపుకుంటేనే రైతులకు నీరు అందుతుంది. తాగునీటికి పరిష్కారం దక్కుతుంది. కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగ ఆనడచుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ఇంకా చర్చించడం వల్ల లాభం లేదు. నిత్యం అదే విషయం ప్రస్తావించకుండా ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. అదే నిజమయితే ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై పోరాడాలి. నిధులు ఎక్కడ దారి మళ్లాయో గుర్తించాలి. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమల కు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పడం ఇప్పుడు సాధ్యం అయ్యే పనికాదు. తుమ్మడి హట్టికి మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయి కనుకనే మహారాష్ట్ర దీనికి అంగీకరించలేదు. విభజనకు ముందే ఈ పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయింది. ఏది ఏమైనా అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ అబద్దాలతో మభ్యపెట్టడం ద్వారా ప్రజాధనాన్ని వృధా చేయరాదు. కాళేశ్వరానికి ఇక ఒ మంచి ముగింపు తీసుకుని రావడం ఉత్తమం.

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు





**టెహ్రాన్, జులై 8:** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మెొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

- ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం
- ఏపీ, తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- డిజిటల్ పరికరాలు స్వాధీనం



**ఢిల్లీ, జూలై 8:** దేశవ్యాప్తంగా బుధవారం నాడు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు, వాటి ప్రచారంపై ఎన్ఐఏ దృష్టి సారించింది. భారతదేశంలో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ (ఖలీఫత్)ను ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న కుట్రపై దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని మరో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలోని మొత్తం 20 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. సోదాల్లో భాగంగా ఉగ్రవాద ప్రచారానికి సంబంధించిన పలు కీలక డిజిటల్ పరికరాలను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉగ్ర కుట్ర కేసుకు సంబంధించి ఇప్పటివరకు 11 మంది నిందితులతో పాటు ఒక మైనర్ బాలుడిని (జువెనైల్) అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ పేర్కొంది. కాగా, ఈ ఏడాది మార్చి నెలలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన ఈ కేసును, తదుపరి సమగ్ర విచారణ నిమిత్తం మే నెలలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలోనే ఐసీస్, ఏక్యూఐఎస్‌లకు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ (టెక్నికల్ అనాలసిస్) ఆధారంగానే ఎన్ఐఏ అధికారులు ఈరోజు తాజా సోదాలు నిర్వహించారు. అరెస్టయిన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, సామాజిక మాధ్యమాల వేదికగా ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ గుర్తించింది. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన మరికొందరు సూత్రధారులను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు స్పష్టం చేశారు.




# బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం

**ఆలయ సిబ్బందిపై వేటు**

**ప్రైవేట్ సెక్రటరీ సస్పెన్షన్, క్రిమినల్ కేసు నమోదు; రంగంలోకి హైలెవల్ కమిటీ**



**డెహ్రాడూన్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకల ఉదంతం కలకలం రేపుతోంది. కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (దీఖుజ) ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ మంగళవారం నుంచే విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, విరాళాల చోరీకి పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఆలయ కమిటీ ఒక సిబ్బందిపై తక్షణమే వేటు వేసింది. ఈ వివాదంపై బీకేటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. ఆలయంలో ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్న ప్రమోద్ నౌతియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ప్రాథమిక విచారణలోనే విరాళాల విషయంలో అతడు తీవ్ర అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 306, 316(5) కింద పోలీసులు అతనిపై కేసులు నమోదు చేశారు. ఆలయ విరాళాల వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన హై-లెవల్ కమిటీ ఏర్పాటైంది. గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తుండగా.. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

# పూణెలో కుప్పకూలిన మూడంతస్థుల భవనం

**ముంబై, జూలై 8 :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలిలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్



చురకలు



# ఓటరు జాబితాలో ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకం




**నేరడిగొండ:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా రూపొందించడంలో ఎమ్యునరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఎమ్యునరేషన్ ప్రక్రియను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులతో కలిసి ఇంటింటికీ వివరాల నమోదు తీరును సమీక్షించి, ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ పేర్లు, వివరాలను ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు. అవసరమైన ధృవీకరణ పత్రాలను సమర్పించి అధికారులు నిర్వహిస్తున్న ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ లెవల్ అధికారులు, నాయకులు మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 10న విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయాలి

**హన్మకొండ:** విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున తెలిపారు. ఈ బంద్కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం హన్మకొండలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు,



స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి సమస్యలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ, మహిళా విద్యార్థుల భద్రత కోసం ప్రతి విద్యాసంస్థలో ఐసీసీ కమిటీల ఏర్పాటు, విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణ, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారం, జాతీయ విద్యా విధానం అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పేద కుటుంబాలకు చేయూత

రూ.5.69 లక్షల చెక్కులను పంపిణీ చేసిన ఆడే గజేందర్



**నేరడిగొండ:** సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తుందని, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. బుధవారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 12 మంది లబ్ధిదారులకు రూ.5లక్షల 69వేల 500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

**కాగజ్ నగర్:** ప్రభుత్వం పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల పాత ప్రభుత్వ ఉన్నత ప్రధానమంత్రి శ్రీ పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, కాలం చెల్లిన నిత్యవసర సరుకులను వినియోగించకూడదని,



వంటశాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్య, మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని త్రిశూల్ పహాడ్ లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వయం ఉపాధి, క్యాంపస్ ప్లేస్ మెంట్ పై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తులు, సాదా బైనమా దరఖాస్తుల ప్రక్రియ, కార్యాలయ రికార్డులు, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుల సంబంధిత అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులతో సరిచూసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, కుల, ఆదాయ, నివాస వంటి వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో నాయబ్ తహసిల్దార్ సరిత, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# డిపిఆర్ఓ సంపత్ కుమార్ సేవలు అభినందనీయమని

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

**ఆసిఫాబాద్ టౌన్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్ జర్నలిస్టులకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని టీయూడబ్ల్యూజే ( ఐజేయూ ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ కొనియాడారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆసిఫాబాద్ జిల్లా నుండి డిపిఆర్ఓ సంపత్ కుమార్ ఎంపికై హాజరైన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో డిపిఆర్ఓ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ మారుమూల వెనుకబడిన జిల్లా నుండి కేంద్ర ఎన్నికల సంఘం సదస్సుకు సంపత్ కుమార్ హాజరు కావడం జిల్లాకే ఎంతో గర్వకారణమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం డిపిఆర్ఓ నిరంతరం శ్రమిస్తున్నారని, అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. ప్రభుత్వానికి, పాలకులకు జర్నలిస్టులకు మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు వేగంగా చేరవేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, జిల్లా నాయకులు నగరారే తారు, సురేష్ చారి, రాధాకృష్ణ చారి, రాజు, జానకిరామ్, నితీష్, మోహన్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్

**కాగజ్ నగర్ :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్ అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం కాపువాడలో 50 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ కె.హరిత, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కామ్రే అనిల్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ గ్రంథాలయాల ఏర్పాటు ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని, విజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. ఉద్యోగాల కొరకు నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయంగా జరిగే విషయాలను తెలుసుకోవచ్చని, ప్రాచీన భారతీయ చరిత్రతో కూడిన పుస్తకాలు గ్రంథాలయంలో లభిస్తాయని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.



# ఆసిఫాబాద్లో ముమ్మరంగా 'ఎస్ఐఆర్' దరఖాస్తుల ప్రక్రియ

- పర్యవేక్షించిన మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్, తహసిల్దార్

**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడి, సందీప్ నగర్ పరిధిలో బుధవారం 'ఎస్ఐఆర్' (SIR) దరఖాస్తుల ప్రక్రియ ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్ లుతహసిల్దార్ రియాజ్ అలీలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును, ఏర్పాట్లను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్లు స్వయంగా హాజరై, అక్కడికి వచ్చిన ప్రజల ఎస్ఐఆర్ ఫారాలను దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఆకాష్, వైస్ చైర్పర్సన్ ఎండి అహ్మద్ లు మాట్లాడుతూప్రజలెవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలి సూచించారు.





అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆలస్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించి, అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, దూడల అశోక్, జయరాజ్ తదితరులతో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానేత వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- 77వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నివాళి
- ఈనెల 10న జరిగే ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

**సత్తుపల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. వైఎస్ఆర్ 77వ జయంతి సందర్భంగా బుధవారం సత్తుపల్లి పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత అని కొనియాడారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమానికి ఆయన చూపిన అంకితభావం నేటి ప్రజాప్రతినిధులకు ఆదర్శమని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు కట్టుబడి పనిచేయడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి..

ఈనెల 10న మధ్యాహ్నం 2.30 గంటలకు ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో



నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# గుండి వంతెనపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి

- గడువు దాటి 16 ఏళ్లు అవుతున్నా అసంపూర్తిగానే గుండి బ్రిడ్జ్ పనులు
- వంతెన పూర్తి చేయకపోతే 15 గ్రామాల ప్రజలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం
- డీ వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



**ఆసిఫాబాద్ రూరల్:** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి గ్రామం వద్ద గుండి వాగుపై నిర్మిస్తున్న హై-లెవెల్ వంతెన (గుండి బ్రిడ్జ్) పనులపై పాలకుల నిర్లక్ష్యం వీడాలని డి.వై.ఎఫ్.ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా ఈ వంతెన నిర్మాణం పెండింగ్‌లో పడటం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మండిపడ్డారు. బుధవారం గుండె బ్రిడ్జి ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2007 లోనే 'నాబార్డ్' నిధులతో హై-లెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, 2010 లోగా పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్ట్, 2026 వచ్చినా ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ₹8.50 కోట్ల వ్యయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, పాలకుల నిర్లక్ష్యం, తీవ్ర కాలయాపన వల్ల ప్రస్తుతం ₹14.40 కోట్లకు చేరిందని, కేవలం 11 పిల్లర్లు మాత్రమే నిర్మించి, స్లాబ్‌లు వేయకుండా వదిలేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. వంతెన లేకపోవడం వల్ల గుండి, దాని చుట్టుపక్కల ఉన్న దాదాపు 15 గ్రామాల ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించిన ప్రతిసారీ ఆసిఫాబాద్ పట్టణంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతుండటంతో, స్థానికులు నాటు పడవలు, థర్మాకోల్ తెప్పలపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. అత్యవసర వైద్య సమయాల్లో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ప్రమాదాలకు గురైన వారిని ఆసుపత్రికి తరలించడానికి దారి లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయే దౌర్భాగ్య స్థితి నెలకొందని, పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, రోజువారీ కూలీల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకుల బూటకపు వాగ్దానాలతో విసిగిపోయిన గ్రామస్తులు గతంలో "వంతెన లేకపోతే – ఓటు లేదు / ఎన్నికలు లేవు" అని ఎన్నికలను బహిష్కరించినా అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఇంచార్జ్ మంత్రులు, కలెక్టర్లు ఇచ్చిన హామీలు కేవలం నోటి మాటలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గుండి వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేనిపక్షంలో 15 గ్రామాల ప్రజలను, బాధితులను ఏకం చేసి ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, మరియు గ్రామ నాయకులు రాహుల్, శంకర్, దిలీప్, సావిత్రి, సోనీ, హారిక, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# రైతు భరోసా నిధుల విడుదలపై సంబరాలు

- సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

**ఆదిలాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా తాంసి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులను విడుదల చేసినందుకు కృతజ్ఞతగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతాంగ అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, అన్నదాతలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు, కప్పర్ల సర్పంచ్ గంద్రత్ అరుణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడల సంతోష్, ఉప సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ఇచ్చోడ బ్లాక్ ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, వడ్డాడి సర్పంచ్ గంగాధర్, పలోది సర్పంచ్ నాగిరెడ్డి, పొన్నారి ఉప సర్పంచ్ రామ్రెడ్డి, కప్పర్ల ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ ఎంపీపీ వన్నెల నరేష్, బోథ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, జిల్లా కార్యదర్శి రామన్న యాదవ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు ధనుంజయ్, అశోక్, ఆత్మ డైరెక్టర్ గంగయ్య, మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అనుపట్ల సంజీవ్, మాజీ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, మౌలానా, చిన్న రాంరెడ్డి, నవీన్, నరేష్, గంగాధర్, హనుమండ్లు, రవి, జీవన్, చిలుకూరి వెంకటరెడ్డి, సురుకుంటి భోజరెడ్డి, నాందేవ్, మోహన్, మావల ఉప సర్పంచ్ అడెల్లు, మోసిన్, అలీం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.




# ఐటీ టవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్:** మావల మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటీ టవర్ నిర్మాణ ప్రాంతాన్ని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఈ ఐటీ టవర్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో భవనాన్ని తీర్చిదిద్ది నిర్ణీత గడువులోగా ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. భవన నిర్మాణంతో పాటు అంతర్గత రహదారులు, విద్యుద్దీకరణ, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు, తాగునీటి వసతి, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందులు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జోనల్ మేనేజర్ ఎం.శివప్రసాద్, డీజెడ్ఎం బహుగుణ, సీఈ నరేందర్ రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈ పురేందర్, నిర్మాణ సంస్థ ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టాస్క్ శిక్షణతో జిల్లా అభ్యర్థులకు టీసీఎస్లో ఉద్యోగాలు

**అభినందించిన కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల:** నిరుద్యోగ యువతకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ ఫలితంగా జిల్లాకు చెందిన ముగ్గురు అభ్యర్థులు టీసీఎస్ క్యాంపస్ ప్లేస్మెంట్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. శిక్షణతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్ల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన జి.కావ్య, ఎం.అంజలి, కె.సాయివాణి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి టీసీఎస్ క్యాంపస్ ప్లేస్మెంట్లో ఎంపికై ఉద్యోగాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. టాస్క్ ద్వారా అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

**కౌటాల:**

కౌటాల మండలంలోని శీర్ష గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడంలో ఈ భవనం కీలకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## 10వ రోజుకు చేరిన కోల్ మైన్స్ అధికారుల రిలే నిరాహార దీక్షలు




**సత్తుపల్లి:** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 9.25 గంటల నుంచే అధికారులు దీక్షా శిబిరంలో కూర్చొని తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా జీతాల అప్గ్రేడేషన్తో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కీలకమైన పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో కెవి.అనిల్ కుమార్, డి.సూర్యప్రకాశ్, యు.సాయి శ్రవణ్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

## వర్షా ల కోసం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం మొండికుంట గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు నిండాలని, రైతాంగం సుభీక్షంగా ఉండాలని వేడుకున్నారు. ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏకస్వరంతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**తాండూర్:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని మాదారం గ్రామ సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా బుధవారం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడడమేనని తెలిపారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, చెట్ల పెంపకంతో భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రతి ఇంటి వద్ద, ప్రతి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, ఉపాధిహామీ టీఏ ప్రసాద్, వార్డు సభ్యులు బానేష్, కత్తెర్ల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బూతుకూరి కమలాకర్, నరేష్, మేట్ పుప్పాల పుష్ప, విజయ్, మీనుగు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం



**తాండూర్:** తాండూర్ సెక్టార్ పరిధిలోని అచలాపూర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు సాంప్రదాయబద్ధంగా అన్నప్రాసన నిర్వహించడంతో పాటు వారి ఎత్తు, బరువును కొలిచి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం తల్లులు, గర్భిణీలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగం, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కౌసల్య, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చురకలు



## గడువులోగా దరఖాస్తులు సమర్పించాలి




**ఆదిలాబాద్:** పట్టణంలోని అర్హులైన ప్రతి ఓటరు తమ పరిధిలోని బీఎల్ఓ నుంచి దరఖాస్తులను తీసుకుని పూర్తిచే ఈనెల 24వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుషా అన్నారు. పట్టణంలోని భుక్తాపూర్ వార్డు నెం.45లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆర్డీఓ, తహశీల్దార్లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు పంపిణీ చేస్తున్న ఓటరు నమోదు దరఖాస్తులు, వాటి పూరణ విధానం, అధికారుల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉండదని, దరఖాస్తు చేయని వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శశికళ, మున్సిపల్ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఈస్గాంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే హరీష్ బాబు చేతుల మీదుగా భూమిపూజ




**కాగజ్నగర్:** కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఈస్గామ్ గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎంపీ గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పల్వాయి హరీష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన నిధులతో ప్రధాన రహదారి నుంచి నందిపేట వెంకటేష్ ఇంటివరకు ఈ సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి ఈ రహదారి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అగ్గిల శ్రీనివాస్, సర్పంచ్ బికాష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లోకందే నరేందర్, స్థానిక వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆమోదంతో అభివృద్ధి పనులకు ఆమోదం

మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ ఆమోదం లభించడంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మార్గం సుగమమైందని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ తెలిపారు. ఇటీవల జూన్ 29న జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకించిన ఎజెండా అంశాలను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ పరిశీలించి ఆమోదం తెలిపినందుకు ఆమె హర్షం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుల సూచనల మేరకు ఎజెండాను కలెక్టర్కు పంపగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆమోదంతో పట్టణంలో రూ.50 లక్షల వ్యయంతో ఇంకుడు గుంతల ఏర్పాటు, రూ.90లక్షలతో సానిటేషన్ వాహనాల కొనుగోలు, హరితహారం కార్యక్రమానికి రూ.35లక్షల నిధుల విడుదలకు మార్గం ఏర్పడిందన్నారు. అలాగే 49 వార్డుల్లో వార్డుకు రూ.3.50 లక్షల చొప్పున చేపట్టనున్న అభివృద్ధి పనులు, 99 రోజుల పట్టణ ప్రణాళిక – ప్రగతి కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులతో పాటు ఇతర మున్సిపల్ అభివృద్ధి పనుల అమలుకు కూడా గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి సహకరించిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేకంగా ఎజెండా అంశాలకు ఆమోదం తెలిపిన జిల్లా కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్




**ఆసిఫాబాద్ టౌన్:** ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన 3 రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఇంగ్లీష్, హిందీ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను ఉపాధ్యాయులు పెంపొందించుకోవాలని తెలిపారు. ఐసిటీ టూల్స్, ఏఐ లను భౌతిక శాస్త్రంలో వినియోగించే విధానం, రేపటి తరం విద్యార్థులను తయారు చేయాలంటే ముందుగా మనం సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా తెలుసుకోవాలని, శిక్షణ కార్యక్రమాల ద్వారా సమగ్ర విద్య అభ్యసన కార్యక్రమాలలో పాల్గొంటూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని సవాళ్లకు ఎదుర్కొనే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు తయారు కావాలని తెలిపారు. టాయి ఆధారంగా విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు ఈ సంవత్సరం అందజేసిన వర్క్ బుక్ లను సమర్థవంతంగా వినియోగించాలని, ప్రతి విద్యార్థికి డిజిటల్ లిటరసీపై అవగాహన ఉండే విధంగా విద్యాబోధన చేయాలని, ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ వినియోగించాలని, విద్యార్థులచే ప్రయోగాలు చేయించాలని, కృత్యాధార బోధన చేయాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి హోలీస్టిక్ విధానం అవలంబించడం ద్వారా విద్యా వికాసం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, శిక్షణ కేంద్ర ఇన్చార్జి ఉమబాల, జిల్లాస్థాయి శిక్షకులు దూడ రాజనర్సుబాబు, శ్రీనాథ్, రాయిస్ అహ్మద్ , సమ్మయ్య, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి

**తాండూర్:** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బగ్గని రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించామని, అయితే ప్రభుత్వాలు మారినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అన్నారు. 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ నివేదికను ప్రభుత్వం స్వీకరించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మూడు డీఏలు పెండింగ్లో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య ఆరుకు చేరిందన్నారు. గత రెండేళ్లుగా జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, ఈఎల్, డీఏ ఏరియర్స్ తదితర బిల్లులు చెల్లించకుండా పెండింగ్లో ఉంచారని ఆరోపించారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని పీఆర్సీ అమలు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులు, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 14న జిల్లా స్థాయిలో, 24న రాష్ట్ర స్థాయిలో ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి మ్యాకం రమేష్, మండల ప్రధాన కార్యదర్శి తుపాకుల తిరుపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా శాఖ ప్రగతి, పాఠశాలల్లో వసతుల కల్పన, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును 30 శాతం పెంచే లక్ష్యంతో ఉపాధ్యాయులు, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలయ్యేలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. డిజిటల్ విద్యను బలోపేతం చేసే దిశగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ కనెక్షన్లు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, డీఆర్డీఓ రవీందర్, మండల విద్యాశాఖ అధికారులు, సెక్టోరల్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానేత వైఎస్ఆర్

- ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్:** దివంగత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజానేత అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజార్ పాషా అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వైఎస్ఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీపక్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖిజార్ పాషా మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగిన వైఎస్సార్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, జిల్లా జనరల్ సెక్రటరీ, కార్యాలయ ఇంచార్జ్ సంజయ్ గౌలీ, జనరల్ సెక్రటరీ ఇమ్రాన్, కార్యదర్శి మందాకినీ, మల్లారెడ్డి, ఎర్రం నరేందర్ రెడ్డి, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ వి.రాములు






**మంచిర్యాల:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం నెన్నెల మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని జోన్-1, జోన్-2 ప్రాంతాలను ఆయా మండలాల తహశీల్దార్లతో కలిసి సందర్శించారు. ప్రతి ఇంటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపించి తిరిగి సేకరించి డిజిటలైజ్ చేయాలని సూచించారు. వాలంటీర్లు, బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్లకు ఫారాల పూరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మందమర్రి, నెన్నెల, బెల్లంపల్లి తహశీల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్తో కలిసి సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పోర్టల్లో పెండింగ్ దరఖాస్తులు, ఎస్ఐఆర్ పురోగతి, భూసేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి సర్టిఫికెట్లను జారీ చేయాలని, కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అదనపు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలి

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**జైనూర్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు)తో సమావేశమయ్యారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా బీఎల్ఏలు ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, వివరాల ధ్రువీకరణలో బూత్ లెవల్ అధికారులు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ప్రతి ఓటు విలువైనదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం జన్నారం, దండేపల్లి మండలాల్లో పాఠశాలలు, ఆశ్రమ విద్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి వివిధ శాఖల పనితీరును పరిశీలించారు. జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు జరుగుతున్న బోధన, హాజరు రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన వంటశాల, పాఠశాల




పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పొనకల్ గ్రామంలోని భవిత వనరుల కేంద్రం, మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, కవ్వాల్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజనశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జన్నారం, దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు, వార్డులు, మందుల నిల్వలు, పరిశుభ్రతను పరిశీలించి, వైద్యులు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈనెల 24లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# కరెంట్ పోతే నెట్వర్క్ బంద్..!

- 'జంగం'లో జియో 'సిగ్నల్' కష్టాలు!
- డిజిటల్ యుగంలోనూ జంగం గ్రామానికి కనెక్టివిటీ శాపం
- ఉద్యోగులు, విద్యార్థులు, రైతుల నిత్యనరకం
- అత్యవసర వేళల్లో అందని ఫోన్ కాల్స్
- పట్టించుకోని జియో యాజమాన్యం..!
- గ్రామస్థుల ఆవేదన





**జైనూర్ :**
ఆధునిక సాంకేతిక యుగంలో స్మార్ట్ఫోన్, ఇంటర్నెట్ అనేవి మనిషి నిత్యజీవితంలో భాగమైపోయాయి. ప్రపంచం మొత్తం '5G' వేగంతో దూసుకుపోతుంటే, జైనూర్ మండలంలోని జంగం గ్రామం మాత్రం కరెంట్ పోతే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే చీకటి రోజుల్లోనే మగ్గుతోంది. ఇక్కడ జియో నెట్వర్క్ సమస్య గ్రామస్థుల పాలిట శాపంగా మారింది. ఫోన్ మాట్లాడాలన్నా.. ఒక చిన్న మెసేజ్ పంపాలన్నా ఊరి చివరకో, చెట్ల పైకో ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది.

**కరెంట్ పోతే కమ్యూనికేషన్ 'డెడ్'!**

గ్రామంలో జియో టవర్ ఉన్నప్పటికీ, అది కేవలం అలంకారప్రాయంగానే మిగిలిందని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగానే.. జియో నెట్వర్క్ సైతం పూర్తిగా గాల్లో కలిసిపోతోంది. టవర్కు కనీస బ్యాకప్ (బ్యాటరీ/జనరేటర్) సదుపాయం సరిగా లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కరెంట్ ఉన్నప్పుడు కూడా సిగ్నల్ నాణ్యత అత్యంత పేలవంగా ఉండటంతో కాల్ డ్రాప్స్ సమస్య నిత్య కృత్యమైంది.

**స్తంభించిన డిజిటల్ సేవలు..ఇబ్బందుల్లో అన్ని వర్గాలు**

ప్రస్తుత రోజుల్లో బ్యాంకింగ్ లావాదేవీలు, రేషన్ పంపిణీ, మీ-సేవ కేంద్రాలు, డిజిటల్ చెల్లింపులు అన్నీ ఇంటర్నెట్తోనే ముడిపడి ఉన్నాయి. నెట్వర్క్ లేకపోవడంతో జంగం గ్రామంలో ఇవన్నీ పూర్తిగా స్తంభించిపోయాయి. ఆన్లైన్ క్లాసులు, పరీక్షల ఫీజులు, దరఖాస్తుల కోసం పక్క ఊర్లకు లేదా మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. వ్యవసాయ సమాచారం, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల అప్డేట్స్ పొందలేక తీవ్ర నష్టపోతున్నామని రైతులు మండిపోతున్నారు. డిజిటల్ పేమెంట్స్ కాకపోవడంతో వ్యాపారాలు సాగక ఇబ్బందులు పడుతున్నారు.

**అత్యవసర వేళల్లో ఆందోళన..**

రాత్రి వేళల్లో ఎవరికైనా హఠాత్తుగా ఆరోగ్యం క్షీణించినా, గర్భిణీలకు ప్రసవ వేదన వచ్చినా.. కనీసం అంబులెన్స్కు ఫోన్ చేద్దామన్నా సిగ్నల్ దొరకడం లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వస్తోంది" అని గ్రామస్థులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**అధికారుల అలసత్వంపై ఆగ్రహం..**

ఈ నెట్వర్క్ దారుణాలపై గ్రామస్థులు ఇప్పటికే పలుమార్లు జియో సంస్థ ప్రతినిధులకు, స్థానిక అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించకపోవడం గమనార్హం. అధికారులు కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారే తప్ప, సమస్యను మూలాల నుంచి పరిష్కరించడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సమస్య పరిష్కరించాలి..**

జియో టవర్కు నిరంతరాయంగా పనిచేసేలా పవర్ బ్యాకప్ ఏర్పాటు చేయాలని, జంగం గ్రామంలో సిగ్నల్ పరిధిని పెంచేందుకు అదనపు పరికరాలు లేదా టవర్ సామర్థ్యాన్ని పెంచాలనీ, సాంకేతిక లోపాలను శాశ్వతంగా సరిదిద్ది నాణ్యమైన వాయిస్, 4G/5G ఇంటర్నెట్ సేవలు అందించాలనీ గ్రామస్థులు కోరుతున్నారు. టెలికాం రంగంలో నంబర్ వన్గా చెప్పుకునే జియో సంస్థ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, జంగం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి డిజిటల్ కష్టాల నుంచి విముక్తి ప్రసాదించాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క
- ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

**జైనూర్:**
ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్తో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ అనేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడిగా ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ చూపిన సంక్షేమ పాలన స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు పెందోర్ ప్రకాష్, సుద్దాల శ్రీనివాస్, సర్పంచ్ మాడవి మనోహర్, తొడసం రాజేందర్, ఉయిక చందు, మెస్రం స్పందన



భూపత్, మాజీ వైస్ ఎంపీపీ షేక్ రషీద్, చెల్లె లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ హైమద్ ఖాన్, నాయకులు లచ్చు, ఆత్రం ప్రకాష్, రహీమ్, కోటేష్, అబ్దుల్లా, సిద్దు, బాపూరావు, దత్తు, మహమ్మదు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలి

**ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ**



**జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటింటి ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమాన్ని గ్రామ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ బుధవారం పరిశీలించారు. సర్వే సిబ్బందితో కలిసి గ్రామంలోని పలువురు కుటుంబాలను సందర్శించి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి కుటుంబం తప్పనిసరిగా పాల్గొని సరైన వివరాలను అందించాలని కోరారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా సర్వే సిబ్బందిని సంప్రదించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని, సర్వేను విజయవంతం చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సూచించారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా వాస్తవ వివరాలనే నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యం...

- మోకిలలో గులాబీ గూటికి భారీ చేరికలు.
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నేతలు సహా 50 మందికి పైగా బీఆర్ఎస్ లో చేరిక.

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి :**



రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం మోకిల గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి సబితా ఇంద్రారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, కాళేశ్వరం వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని గుర్తుచేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజాక్షేత్రంలో పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు. మోకిల గ్రామంలో తాజా చేరికలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్కు ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సిద్ధాంతాలు, గత ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై మోకిల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శంకర్ నాయక్, శాలిని బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు ధనలక్ష్మి , కమల్ నాయక్, ఖానాపురం రవళి, శ్రీశైలం, సువర్ణలతో పాటు సుమారు 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్లో చేరారు. తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమం, గ్రామీణ పురోగతే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చేవెళ్ల మాజీ ఇన్చార్జ్ దేశముల ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు మన్నె లింగం ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సభావత్ రాజు నాయక్, కౌన్సిలర్ భానూరి కృష్ణ, జూలకంటి మహేందర్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచులు దోసాడ నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, పిల్లిగుండ్ల రాఘవేందర్, మానయ్య, మోకిల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోపాల్ చారి, గౌండ్ల కృష్ణయ్య, రాగల నర్సింలు, శ్రీకాంత్, లాగల చిన్ని నరసింహులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన పుప్పాల వాగు బ్రిడ్జి...

- తక్షణమే శాశ్వత మరమ్మతులు చేపట్టాలి
- మాజీ సర్పంచ్

**రామాయంపేట:**
రామాయంపేట మండలంలోని పర్వతాపూర్–కాట్రియాల్ గ్రామాల మధ్య ఉన్న పుప్పాల వాగు బ్రిడ్జి గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతరం అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి మట్టి రహదారిని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుత వర్షాకాలంలో కురుస్తున్న స్వల్ప వర్షాలకే రహదారి మళ్లీ కోతకు గురవుతూ బ్రిడ్జి మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చేప్యాల స్వామి మాట్లాడుతూ, గత వర్షాకాలంలో దెబ్బతిన్న బ్రిడ్జికి అధికారులు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారని, శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతుండటంతో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పర్వతాపూర్, కాట్రియాల్ గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఈ బ్రిడ్జి ప్రధాన రాకపోకల మార్గమని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.భారీ వర్షాలు కురిసేలోపు అధికారులు అత్యవసరంగా బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైతే కొత్త వంతెన నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# శానిటరీ ఉత్పత్తులు ఉపయోగించే విషయంలో మహిళలు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే

మహిళల నెలసరి సమయంలో ఉపయోగించే శానిటరీ ఉత్పత్తులు ప్రతి నెలా అవసరమైనవే అయినప్పటికీ, వాటిని ఎంపిక చేసేటప్పుడు కేవలం సౌకర్యం మాత్రమే కాకుండా ఆరోగ్య భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జీవితకాలంలో వేల గంటల పాటు ఈ ఉత్పత్తులను ఉపయోగించాల్సి వచ్చే నేపథ్యంలో వాటి తయారీ పదార్థాలు, సువాసన రసాయనాలు, గాలి ప్రసరణ సామర్థ్యం, చర్మానికి కలిగే ఇబ్బందులు, ఇన్ఫెక్షన్ల ప్రమాదం వంటి అంశాలపై అవగాహన ఉండటం అవసరమని నిపుణులు చెబుతున్నారు. నెలసరి పరిశుభ్రత ఉత్పత్తుల విషయంలో సువాసన కలిగిన వెట్ వైప్స్, ప్యాంటీ లైనర్లకు అత్యంత తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. వీటిలో ఉండే సుగంధ ద్రవ్యాలు, ప్రిజర్వేటివ్‌లు యోని సహజ పీహెచ్ సమతుల్యతను దెబ్బతీసి తరచూ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియల్ వెజినోసిస్, ఈస్ట్ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ అనే పదం మార్కెటింగ్ కోసం ఉపయోగించేదే తప్ప వైద్యపరమైన ప్రయోజనాన్ని సూచించదని పేర్కొంటున్నారు.



## ట్యాంపాన్ లను జాగ్రత్తగా వాడాలి..

ట్యాంపాన్‌లను కూడా జాగ్రత్తగా ఉపయోగించాల్సిన ఉత్పత్తులుగా పేర్కొంటున్నారు. సువాసన లేని ట్యాంపాన్‌లనే ఎంచుకోవాలని, నిర్ణీత సమయం కంటే ఎక్కువసేపు వాటిని ఉంచితే అరుదైనప్పటికీ తీవ్రమైన టాక్సిక్ షాక్ సిండ్రోమ్ ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. అందువల్ల వాటిని సమయానికి మార్చడం చాలా ముఖ్యమని చెబుతున్నారు. సాధారణ శానిటరీ ప్యాడ్లు విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి ప్లాస్టిక్ వెనుక పొర వేడి, తేమను ఎక్కువసేపు బంధించి ఉంచడం వల్ల చర్మంపై దద్దుర్లు, అసౌకర్యం కలిగే అవకాశం ఉంటుంది. ఇవి ఉపయోగించడానికి అనుకూలమైనప్పటికీ అత్యుత్తమ ఎంపికగా చెప్పలేమని, పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు.

## బ్రాండ్‌పై ఆధారపడే నాణ్యత..

పీరియడ్ అండర్‌వేర్ సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయంగా ఉన్నప్పటికీ, వాటి నాణ్యత పూర్తిగా బ్రాండ్‌పై ఆధారపడి ఉంటుంది. కొన్ని బ్రాండ్‌ల ఉత్పత్తుల్లో పీఎఫ్ఏఎస్ (ఫ్లాషీగూరా) అనే ఫారెవర్ కెమికల్స్ గుర్తించిన సందర్భాలు ఉండటంతో, కొనుగోలు చేసే ముందు బ్రాండ్ విశ్వసనీయతను తప్పనిసరిగా పరిశీలించాలి. పునర్వినియోగం చేయగల క్లాత్ ప్యాడ్లు ఆరోగ్యపరంగా మంచి ఎంపికలలో ఒకటిగా ఉంటాయి. మృదువైన, గాలి సులభంగా ప్రసరించే వస్త్రంతో తయారవడం వల్ల చర్మానికి తక్కువ చికాకు కలిగించి, సౌకర్యవంతంగా ఉంటాయి. అయితే వాటిని ప్రతి వినియోగం తర్వాత శుభ్రంగా ఉతికి, పూర్తిగా ఆరబెట్టి ఉపయోగించడం చాలా అవసరం.

## కాటన్ ప్యాడ్లు మెరుగైన ఎంపిక..

ఆర్గానిక్, బ్లీచ్ చేయని కాటన్ ప్యాడ్లు కూడా మెరుగైన ఎంపికగా ఉంటాయి. వీటిలో జెల్స్, బ్లీచింగ్ రసాయనాలు, సువాసన పదార్థాలు లేకపోవడం వల్ల చర్మానికి తక్కువ హాని కలిగే అవకాశం ఉంటుంది. మెడికల్ గ్రేడ్ సిలికాన్‌తో తయారైన మెన్స్ట్రువల్ కప్‌ను అత్యుత్తమ ఎంపికగా చెప్పవచ్చు. ఇది పునర్వినియోగం చేయదగినది, సువాసన పదార్థాలు లేదా బ్లీచింగ్ రసాయనాలు ఉండవు. పరిశుభ్రంగా శుభ్రపరుచుకుని సరిగ్గా ఉపయోగిస్తే ఇది సురక్షితంగా ఉండటంతోపాటు దీర్ఘకాలంలో ఖర్చును కూడా తగ్గిస్తుంది. పరిశుభ్రమైన పదార్థాలతో తయారైన, సువాసనలేని ఉత్పత్తులను ఎంచుకోవడం, వాటిని సమయానికి మార్చడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వల్ల ఇన్ఫెక్షన్లు, చర్మ సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. అందరికీ ఒకే ఉత్పత్తి సరిపోదు, తమ శరీరానికి అనుకూలమైన ఎంపికను అవగాహనతో చేసుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఎంతో కీలకం.

# దంత సమస్యలకు కేవలం పిల్లలకే బ్రేసెస్ చికిత్స చేస్తారా.. పెద్దలకు చేయవచ్చా..?

దంతాలను నిటారుగా చేయడానికి ఉపయోగించే డెంటల్ బ్రేసెస్ అంటే చాలామందికి పిల్లలు లేదా టీనేజ్ వయసువారే గుర్తుకు వస్తారు. అయితే బ్రేసెస్ చికిత్స పిల్లలకే పరిమితం కాదని, పెద్దలలో కూడా సమర్థవంతంగా పనిచేస్తుందని దంత నిపుణులు చెబుతున్నారు. వయసు కంటే దంతాలు, చిగుళ్లు, వాటికి మద్దతు ఇచ్చే ఎముకల ఆరోగ్యం బాగుండటమే చికిత్స విజయానికి కీలకమని వారు వివరిస్తున్నారు. నిపుణుల ప్రకారం, టీనేజ్ దశలో దవడ ఇంకా ఎదుగుతున్నందున ఆ సమయంలో ఆర్థోడాంటిక్ చికిత్స కొంత సులభంగా జరుగుతుంది. అయితే నియంత్రిత ఒత్తిడిని ఉపయోగించి దంతాలను కావాల్సిన స్థానానికి క్రమంగా కదిలించే ప్రక్రియ ఏ వయసులోనైనా సాధ్యమే. 15 ఏళ్లు, 35 ఏళ్లు లేదా 65 ఏళ్లు అయినా దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటే బ్రేసెస్ ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని చెబుతున్నారు.

## పెద్దలకూ పనిచేస్తుంది..

ఇటీవలి కాలంలో పెద్దలలో కూడా బ్రేసెస్ చికిత్స తీసుకునే వారి సంఖ్య పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా క్లియర్ అలైనర్లు అందుబాటులోకి రావడం, దంతాల అందంపై ప్రజల్లో అవగాహన పెరగడం, డిజిటల్ ఆర్థోడాంటిక్స్‌లో వచ్చిన సాంకేతిక పురోగతి వల్ల సంప్రదాయ బ్రేసెస్‌కు ప్రత్యామ్నాయంగా తక్కువగా కనిపించే చికిత్సా విధానాలను చాలామంది ఎంచుకుంటున్నారని వివరిస్తున్నారు. చాలామంది బ్రేసెస్‌ను కేవలం అందమైన చిరునవ్వు కోసం మాత్రమే ఉపయోగిస్తారని భావిస్తుంటారు. కానీ ఆర్థోడాంటిక్ చికిత్స వల్ల నోటి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వంకరగా లేదా ఒకదానిపై ఒకటి ఉన్న దంతాలను పూర్తిగా శుభ్రం చేయడం కష్టమవడంతో దంతక్షయం, చిగుళ్ల వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. అలాగే దంతాల అమరిక సరిగా లేకపోతే కొన్ని దంతాలపై అధిక ఒత్తిడి పడటం, దంతాలు క్షీణించడం, దవడ నొప్పి, ఆహారాన్ని నమలడంలో ఇబ్బందులు వంటి సమస్యలు తలెత్తుతాయని వారు అంటున్నారు.

## ఏమేం లాభాలు ఉంటాయి..

బ్రేసెస్ చికిత్స ద్వారా దంతాల అమరికను, కాటు (బైట్) లోపాలను సరిచేయడం వల్ల ఈ సమస్యలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీంతో నోటి పరిశుభ్రతను మెరుగ్గా నిర్వహించుకోవడంతోపాటు దంతాలు, చిగుళ్ల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరిస్తున్నారు. వయసు కారణంగా బ్రేసెస్ అవసరం లేదని భావించడం సరైన అభిప్రాయం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారికి ఆర్థోడాంటిక్ చికిత్స అందుబాటులో ఉందని, చికిత్సకు అనుకూలతను నిర్ణయించేది వయసు కాదు, దంతాలు, చిగుళ్ల మొత్తం ఆరోగ్యమేనని చెబుతున్నారు. అందమైన చిరునవ్వుతో పాటు ఆరోగ్యకరమైన నోటి సంరక్షణ కోసం అవసరమైతే ఏ వయసులోనైనా బ్రేసెస్ చికిత్సను పరిగణించవచ్చని వారు సూచిస్తున్నారు.



# పిల్లలు ఫోన్ ఎక్కువగా చూసే అలవాటును కలిగి ఉంటే.. తల్లిదండ్రులు ఏం చేయాలి..?



కేవలం వినోదం కోసమే కాకుండా చదువుల కోసం కూడా డిజిటల్ పరికరాల వినియోగం పెరిగిపోతున్న ఈ రోజుల్లో పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వడం చాలా కుటుంబాల్లో సాధారణమైంది. అయితే ఫోన్ కొనివ్వడం కంటే, దాన్ని ఎలా బాధ్యతాయుతంగా ఉపయోగించాలో నేర్పించడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు. చిన్న వయసులోనే అధిక స్క్రీన్ టైమ్ అలవాటుగా మారితే అది పిల్లల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పిల్లల మెదడు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉంటుంది. ముఖ్యంగా ఏకాగ్రత, స్వీయ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను సమతుల్యం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఈ దశలోనే రూపుదిద్దుకుంటాయి. ఎక్కువసేపు మొబైల్, ట్యాబ్ లేదా ఇతర స్క్రీన్‌ల ముందు గడపడం వల్ల మెదడుపై అధిక ఉత్తేజం ఏర్పడి, ఏకాగ్రత తగ్గడం, భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం, వాస్తవ జీవితంలోని కార్యకలాపాలపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వారు వివరిస్తున్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రభావం..

ముఖ్యంగా సోషల్ మీడియా షార్ట్ వీడియోలు, వేగవంతమైన గేమ్స్ వంటి కంటెంట్ పిల్లలను నిరంతరం ఆకర్షిస్తుంటాయి. దీంతో నిజ జీవితంలో నెమ్మదిగా జరిగే ఆటలు, పుస్తకాలు చదవడం, స్నేహితులతో గడపడం వంటి కార్యకలాపాలపై ఆసక్తి తగ్గిపోతుంది. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్లో చిరాకు, అసహనం, ఏకాగ్రత లోపం, మూడ్ స్వింగ్స్, బయట ఆడుకోవాలనే ఆసక్తి తగ్గడం వంటి మార్పులను గమనిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్‌లకు అలవాటు పడిన పిల్లల్లో తక్షణ సంతృప్తి కోరుకునే స్వభావం కూడా పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. గేమ్‌లలో వచ్చే రివార్డులు, నిరంతరం అందుబాటులో ఉండే కొత్త వీడియోలు లేదా కంటెంట్ కారణంగా పిల్లలు ఎప్పటికప్పుడు ఫోన్‌ను ఉపయోగించాలని భావిస్తారు. ఫోన్‌ను తీసేస్తే కొందరిలో కోపం, ఏడుపు, అసహనం లేదా ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తాయని వారు పేర్కొంటున్నారు. అధిక స్క్రీన్ టైమ్ ప్రభావం ముందుగా నిద్రపై పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పడుకునే ముందు ఎక్కువసేపు మొబైల్ వాడితే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి నిద్ర నాణ్యత దెబ్బతింటుంది. పిల్లల్లో సరైన నిద్ర లేకపోవడం వల్ల జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యం, భావోద్వేగ నియంత్రణ, మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

## పూర్తిగా దూరంగా ఉంచొద్దు..

అయితే పిల్లలను పూర్తిగా సాంకేతిక పరికరాలకు దూరంగా ఉంచడం ఆచరణలో సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాంకేతికతను పూర్తిగా నిషేధించడం కంటే, సమతుల్యంగా ఉపయోగించే అలవాటు పెంపొందించడం ముఖ్యమని సూచిస్తున్నారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా వినియోగిస్తే అది హానికరం కాదని, పిల్లల్లో ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు పెంపొందించడం అవసరమని చెబుతున్నారు. దీని కోసం ప్రతిరోజూ నిర్దిష్ట స్క్రీన్ టైమ్‌ను నిర్ణయించడం, బయట ఆటలు, క్రీడలు, శారీరక వ్యాయామాలను ప్రోత్సహించడం, పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, సంగీతం వంటి హాబీలను అలవాటు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసే సమయంలో, నిద్రకు ముందు స్క్రీన్‌లను పూర్తిగా దూరంగా ఉంచడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులే మొబైల్ వినియోగంలో ఆదర్శంగా ఉండి, పిల్లలతో కలిసి సమయం గడపడం ద్వారా ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లు పెంపొందించవచ్చని వారు పేర్కొంటున్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

### ఏకంగా 1,677.12 పాయింట్లు పతనం

### 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి




**ముంబై, జులై 8 :** పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యక్తమైన ఆందోళనల సెగ బుధవారం నాటి ట్రేడింగ్‌లో భారత సూచీలను భారీ నష్టాల్లోకి నెట్టింది. ఉదయం నుంచి ఒడిదుడుకులతో సాగిన మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి గురై మరింతగా కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1,677.12 పాయింట్లు పతనమై 76,503.60 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ-50 సైతం 516.65 పాయింట్లు నష్టపోయి 23,882.05 వద్ద ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 77,816.45 పాయింట్ల వద్ద, నిఫ్టీ 24,259.55 పాయింట్ల వద్ద లాభనష్టాల మధ్య సాధారణంగానే ప్రారంభమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 77,851.18 వద్ద, నిఫ్టీ 24,300.00 వద్ద ఈరోజు గరిష్ఠాలను తాకాయి. అయితే మధ్యాహ్నం 1:00 గంట దాటిన తర్వాత పశ్చిమాసియా నుంచి వచ్చిన ప్రతికూల వార్తలతో మార్కెట్లు నిలువునా కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఒకానొక దశలో 76,259.03 పాయింట్ల కనిష్టానికి, నిఫ్టీ 23,805.20 పాయింట్ల కనిష్టానికి పడిపోయి ఇన్వెస్టర్లలో వణుకు పుట్టించాయి. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచవ్యాప్త మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయాలతో చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇది భారత్ లాంటి దిగుమతులపై ఆధారపడే దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమైంది. మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడంతో విదేశీ, స్వదేశీ ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోకుండా షేర్లను విక్రయించి నగదును సురక్షితమైన బంగారం వైపు మళ్లించేందుకు మొగ్గు చూపారు. బుధవారం ముగిసిన ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్, మెటల్, రియల్ ఎస్టేట్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మార్కెట్లు ఒకే రోజు ఈ స్థాయిలో పతనం కావడంతో ఇన్వెస్టర్ల దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద కరిగిపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 2శాతం పైగా పడిపోవడంతో రూ. 8.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లి ఇండియా విక్స్ 25 పెరిగిపోయింది. ఒకే సెషన్‌లో పెట్టుబడిదారుల సంపద సుమారు రూ. 8.40 లక్షల కోట్లు క్షీణించింది. గత సెషన్‌లోని రూ. 480.20 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్, ఈ సెషన్‌లో రూ. 471.80 లక్షల కోట్లకు పడిపోయింది. ఫలితంగా సెషన్ సమయంలో అస్థిరత తీవ్రంగా పెరిగింది. ఇండియా విక్స్ 24.86 శాతం పెరిగి 14.54కు చేరింది. ఇది పెట్టుబడిదారులలో పెరిగిన ఆందోళనను సూచిస్తోంది. ఇవాళ మార్కెట్ అంతటా కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఎన్ఎస్ఈలో 2,525 స్టాక్‌లు క్షీణించగా, 694 పురోగమించాయి. 86 స్టాక్‌లు యథాతథంగా ఉన్నాయి. దీంతో, అన్ని ప్రధాన రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 2.72 శాతం, నిఫ్టీ కెమికల్స్ 2.67 శాతం, నిఫ్టీ సిమెంట్ 2.57 శాతం, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ 2.52 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.51 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 2.49 శాతం, నిఫ్టీ ÷నాన్షియల్ సర్వీసెస్ 2.45 శాతం, నిఫ్టీ మీడియా 2.31 శాతం, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఆయిల్ / గ్యాస్ ఒక్కొక్కటి 2.23 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్‌లలో, ఇండిగో 5 శాతం పడిపోయింది. దాని తర్వాత మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలివర్, బజాజ్ ÷నాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా / మహీంద్రా, ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ / టూబ్రో, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి. అయితే, సెన్సెక్స్‌లో ట్రెంట్ అతి తక్కువగా ప్రభావితమైన స్టాక్‌గా నిలవడం విశేషం. ఇది 0.20 శాతం స్వల్పంగా తగ్గింది.



## మళ్లీ తగ్గిన బంగారం

**హైదరాబాద్, జూలై 8:** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. బుధవారం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.770, 22 క్యారెట్ల బంగారం రూ.700, 18 క్యారెట్ల బంగారం రూ.570 మేర తగ్గింది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఊరట లభించింది. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,490గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,32,450, 18 క్యారెట్ల బంగారం రూ.1,08,370 వద్ద ట్రేడవుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో బంగారం ధరలు ఒకే విధంగా కొనసాగుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, కడప నగరాల్లో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,420గా ఉండగా, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వడోదరా, ఇండోర్ నగరాల్లో రూ.1,44,490గా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల కదలికలు, డాలర్ మారకం విలువ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల నిర్ణయాల ప్రభావంతో దేశీయంగా బంగారం ధరల్లో ప్రతిరోజూ మార్పులు చోటుచేసుకుంటున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసే ముందు స్థానిక బంగారు వ్యాపారుల వద్ద తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

# రాత్రివేళ ఉద్యోగుల కోసం స్విగ్గీ కొత్త సేవలు




**హైదరాబాద్, జూలై 8:** రాత్రి వేళల్లో పనిచేసే ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఆన్‌లైన్ ఆహార సరఫరా సంస్థ స్విగ్గీ 'లేట్ నైట్ ఈట్స్' పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది. జూలై 2026 నుంచి దేశంలోని 30 ప్రధాన నగరాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు 4,000కు పైగా కార్యాలయ ప్రాంతాలు, 30,000కు పైగా రెస్టారెంట్ల ద్వారా వినియోగదారులు ఆహారం ఆర్డర్ చేసుకునే వీలుంది. ఈ సేవల్లో భాగంగా ప్రముఖ ఆహార బ్రాండ్ల నుంచి ప్రత్యేక తగ్గింపులు, వేగవంతమైన డెలివరీ సదుపాయం కల్పిస్తున్నారు. కార్యాలయాల్లో పని చేసే వారికి అనువుగా రోల్స్, ర్యాప్స్, ధాన్యాలతో తయారైన ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, కాఫీ, టీలు, అలాగే బృందంగా ఆర్డర్ చేసుకునేందుకు పిజ్జా వంటి ప్రత్యేక ఆహార ఎంపికలను అందుబాటులో ఉంచారు. రాత్రి రెండు గంటల వరకు నిరంతరాయంగా సేవలు అందించేలా '2 ఏఎం క్లబ్' పేరుతో మరో ప్రత్యేక విభాగాన్ని కూడా స్విగ్గీ యాప్‌లో ప్రవేశపెట్టింది. దీంతో అర్ధరాత్రి వరకు పనిచేసే ఉద్యోగులకు సులభంగా ఆహారం అందే అవకాశం కల్పించింది. స్విగ్గీ అంతర్గత గణాంకాల ప్రకారం, ప్రధాన కార్యాలయ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగుల్లో సుమారు 25 శాతం మంది రాత్రి 10 గంటల తర్వాత ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ ధోరణి మెట్రో నగరాలతో పాటు భువనేశ్వర్, గోవా, కొచ్చి, లక్నో, విశాఖపట్నం, అహ్మదాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా వేగంగా పెరుగుతోంది. ఈ సందర్భంగా స్విగ్గీ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమయాలకు అనుగుణంగా పని చేసే ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. తక్కువ ధరలో, వేగంగా, అవసరమైన సమయంలో ఆహారం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



# భారత్‌లో యమహా ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదల

**హైదరాబాద్, జూలై 8:** భారత్‌లో యమహా తన కొత్త ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్ లిలి'ఏరాక్స్-ఈ'లిలిను అధికారికంగా విడుదల చేసింది. ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.82 లక్షలుగా నిర్ణయించిన ఈ స్కూటర్ ప్రస్తుతం దేశీయ మార్కెట్లో యమహా విక్రయిస్తున్న అత్యంత ఖరీదైన మోడల్‌గా నిలిచింది. కంపెనీ నుంచి భారత్‌లో విడుదలైన రెండో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం ఇదే. ఈ స్కూటర్‌లో రెండు 1.5 కిలోవాట్ గంటల డిటాచబుల్ బ్యాటరీ ప్యాక్‌లను అందించారు. మొత్తం 3 కిలోవాట్ గంటల సామర్థ్యంతో పనిచేసే ఈ బ్యాటరీలకు 9.5 కిలోవాట్ ఎలక్ట్రిక్ మోటార్‌ను జత చేశారు. ఈ మోటార్ గరిష్ఠంగా 12.9 హెచ్‌పీ శక్తి, 48 న్యూటన్ మీటర్ల టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే 117 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉందని యమహా వెల్లడించింది. రైడింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరచేందుకు ఎకో, స్టాండర్డ్, పవర్, బూస్ట్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లను అందించారు. ముఖ్యంగా బూస్ట్ మోడ్ ద్వారా అవసరమైన సమయంలో అదనపు శక్తిని పొందుతూ వేగంగా ఓవర్‌టేక్ చేసే అవకాశం ఉంటుంది. భద్రతకు ప్రాధాన్యమిస్తూ ముందు చక్రానికి ఏబీఎస్‌తో కూడిన డిస్క్ బ్రేక్, వెనుక చక్రానికి డిస్క్ బ్రేక్‌ను అమర్చారు. పెట్రోల్ ఏరాక్స్ 155 తరహాలోనే స్పోర్టీ రైడింగ్ అనుభూతిని అందించేలా ఈ మోడల్‌ను రూపొందించారు. ఎలక్ట్రిక్ వాహనం కావడంతో నిర్వహణ వ్యయం కూడా తక్కువగా ఉంటుందని కంపెనీ తెలిపింది. డిజైన్ పరంగా చూస్తే పెట్రోల్ వెర్షన్ పోలికలనే కొనసాగించారు. ట్విన్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లతో ఆకర్షణీయమైన స్పోర్టీ లుక్‌ను అందించారు. సాధారణ ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో అత్యాధునిక టీఎఫ్‌టీఎఫ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. మొబైల్ యాప్ కనెక్టివిటీ వంటి స్మార్ట్ ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, పుణె, చెన్నై నగరాల్లో ఈ స్కూటర్ విక్రయాలను ప్రారంభించారు. ప్రీమియం డిజైన్, 117 కిలోమీటర్ల రేంజ్, ఆధునిక ఫీచర్లతో నగర ప్రయాణాలతో పాటు పనితీరుకు ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యంగా యమహా ఈ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది.

# ఇంధన ధరలు యథాతథం

### వాహనదారులకు ఊరట

**హైదరాబాద్, జూలై 8:** దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు గురువారం తాజా పెట్రోల్, డీజిల్ ధరలను ప్రకటించాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా ప్రతిరోజూ ఉదయం ఇంధన ధరలను సవరిస్తున్నప్పటికీ, ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో ధరల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.69గా, డీజిల్ ధర రూ.103.82గా కొనసాగుతోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో కూడా ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. స్థానిక రవాణా వ్యయాలు, డీలర్ కమీషన్ల కారణంగా కొన్ని ప్రాంతాల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.117.51, డీజిల్ రూ.105.20గా కొనసాగుతోంది. విశాఖపట్నం, గుంటూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం నగరాల్లో కూడా ధరలు గత కొన్ని రోజులుగా యథాతథంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వచ్చే హెచ్చుతగ్గులు దేశీయ ఇంధన ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం చమురు సంస్థలు ధరలను స్థిరంగా కొనసాగించాయి. దీంతో వాహనదారులకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది. కొనుగోలు చేసే ముందు స్థానిక బంకుల్లో తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.




# క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతోంది

**హైదరాబాద్, జూలై 8:** దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం క్రమంగా పెరుగుతున్నట్లు ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజా నివేదిక వెల్లడించింది. కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకుంటున్న వారిలో యువతతో పాటు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల వినియోగదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని తెలిపింది. అయినప్పటికీ ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో క్రెడిట్ కార్డుల వినియోగం ఇంకా తక్కువగానే ఉందని, ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. నివేదిక ప్రకారం 2016 మార్చిలో దేశంలో 1.4 కోట్లుగా ఉన్న క్రెడిట్ కార్డు హోల్డర్ల సంఖ్య 2026 మార్చి నాటికి 5.2 కోట్లకు చేరుకుంది. ఇదే కాలంలో యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 2.1 కోట్ల నుంచి 10.7 కోట్లకు పెరిగింది. అలాగే క్రెడిట్ కార్డులపై ఉన్న బకాయిలు రూ.0.4 లక్షల కోట్ల నుంచి రూ.3.1 లక్షల కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. కొత్తగా క్రెడిట్ కార్డులు తీసుకున్న వారిలో 30 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగిన వారి వాటా 2022లో 43 శాతం ఉండగా, 2026 నాటికి అది 50 శాతానికి చేరింది. అదే విధంగా సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల నుంచి కార్డులు తీసుకున్న వారి వాటా 42 శాతం నుంచి 46 శాతానికి పెరిగినట్లు నివేదిక పేర్కొంది. మొదటిసారి క్రెడిట్ కార్డు తీసుకునే వారిలో 25 శాతం మందికి ఇప్పటికే మూడు లేదా అంతకంటే ఎక్కువ రుణ ఖాతాలు ఉన్నాయని నివేదిక వెల్లడించింది. చిన్న మొత్తాల వ్యక్తిగత రుణాలు, వినియోగ వస్తువుల రుణాలతో పాటు క్రెడిట్ కార్డులను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపింది. అయితే దేశంలో క్రెడిట్ వినియోగదారుల్లో కేవలం 25 శాతం మందికి మాత్రమే క్రెడిట్ కార్డులు ఉన్నాయని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ పేర్కొంది. ఇది బ్రిటన్‌లో 70 శాతం, కొలంబియాలో 62 శాతం, హాంకాంగ్‌లో 98 శాతంతో పోలిస్తే చాలా తక్కువని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారత్‌లో క్రెడిట్ కార్డుల విస్తరణకు ఇంకా భారీ అవకాశాలు ఉన్నాయని సంస్థ అభిప్రాయపడింది.



# కొలంబియా షూటౌట్.. క్వార్టర్స్‌లోకి స్విట్జర్లాండ్



**వాంకోవర్:** ఫిఫా వరల్డ్‌కప్‌లో మంగళవారం మరో మ్యాచ్ ఉత్కంఠంగా జరిగింది. స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్ ఆధారంగా కొలంబియాపై విజయాన్ని నమోదు చేసింది. 4-3 గోల్స్ తేడాతో షూటౌట్‌లో స్విస్ నెగ్గింది. తొలుత ఇరు జట్ల మధ్య రౌండ్16 మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎక్స్‌ట్రా టైంలో కూడా రెండు జట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే పెనాల్టీ షూటౌట్‌లో మాత్రం స్విస్‌కు కలిసి వచ్చింది. కీలకమైన నిర్ణయాత్మక పెనాల్టీని రూబెన్ వర్గాస్ గోల్‌గా మలచడంతో స్విట్జర్లాండ్ బృందంలో సంబరాలు మొదలయ్యాయి. కొలంబియాపై 4-3 తేడాతో షూటౌట్‌లో నెగ్గిన స్విట్జర్లాండ్.. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్నది. మిస్సోరీలోని కన్సాస్ సిటీలో శనివారం ఈ మ్యాచ్ జరగనున్నది. ఫిఫా వరల్డ్‌కప్‌లో 1954 నుంచి ఇప్పటి వరకు స్విట్జర్లాండ్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించలేదు. వరల్డ్‌కప్‌లో రెండు గోల్స్ కొట్టిన స్విస్ ప్లేయర్ వర్గాస్ ఈ మ్యాచ్‌లో స్టాపేజ్ టైంలో ఎంట్రీ ఇచ్చాడు. కొలంబియా ప్లేయర్లు డేవిన్సన్ సాంచేజ్, కూచో హెర్నాండేజ్ .. షూటౌట్‌లో విఫలం అయ్యారు. దీంతో స్విట్జర్లాండ్ విక్టరీకి మార్గం ఈజీ అయ్యింది. వాస్తవానికి స్విట్జర్లాండ్ జట్టులో కీలక ప్లేయర్ అయిన జోహన్ మన్‌జంబీ.. మోకాలి గాయం వల్ల ఈ మ్యాచ్‌లో ఆడలేదు. అటాక్ ప్లేయర్ లేకపోవడంతో స్విస్ తీవ్ర ఇబ్బందులు పడింది.

# మెస్సీ-ఈజిప్ట్ కోచ్ మధ్య వాగ్వాదం



**అట్లాంటా, జూలై 8:** ఫిఫా ప్రపంచకప్ ప్రిక్వార్టర్ పోరు ముగిసిన తర్వాత అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, ఈజిప్ట్ ప్రధాన కోచ్ హోసమ్ హసన్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో అర్జెంటీనా విజయం సాధించిన అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మ్యాచ్ ముగిసిన వెంటనే టచ్‌లైన్ వద్ద మెస్సీ, హోసమ్ హసన్ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఈజిప్ట్ కోచ్ ఆగ్రహంతో రెండు చేతులను 'ఎక్స్' ఆకారంలో చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈజిప్ట్ కోచింగ్ సిబ్బందిలోని ఓ సభ్యుడు మెస్సీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, మ్యాచ్ అధికారులు అతడికి రెడ్ కార్డు చూపించారు. వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు మెస్సీని చుట్టుముట్టగా, భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే మెస్సీ, హసన్ మధ్య జరిగిన సంభాషణ ఏమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు. మ్యాచ్ అనంతరం హోసమ్ హసన్ చేసిన 'ఎక్స్' సంకేతంపై వివాదం నెలకొంది. మెస్సీని ఉద్దేశించి జాతి వివక్షకు సంబంధించిన వ్యాఖ్యలు లేదా సంకేతాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, ఆ సంకేతం అర్థంపై దర్యాప్తు కొనసాగుతోందని ఫిఫా, ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం తెలిపాయి. అవసరమైతే ఫిఫా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. మ్యాచ్‌లో తొలిఅర్ధంలో రెండు గోల్స్‌తో ఆధిక్యంలో నిలిచిన ఈజిప్ట్, చివరి నిమిషాల్లో వరుసగా మూడు గోల్స్ సమర్పించుకోవడంతో 3-2 తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఈజిప్ట్ కోచ్, మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. తమ జట్టుకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ, ఈ ప్రపంచకప్‌లో మిగిలిన మ్యాచ్‌లను తాను చూడబోనని వ్యాఖ్యానించారు.

# 76 పరుగులకే కుప్పకూలిన టీమిండియా

## చరిత్రలో భారత్ సాధించిన అత్యల్ప స్కోర్లు ఇవే!



టీ20 క్రికెట్‌లో అత్యంత భారీ బ్యాటింగ్ లైనప్ లలో టీమిండియా ఒకటి. 2024, 2026 వరుస టీ20 ప్రపంచకప్‌లు గెలవడంతో పాటు మధ్యలో ఆసియా కప్ టీ20 టైటిల్‌ను కూడా కైవసం చేసుకుని ఈ ఫార్మాట్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. అయితే ఎంత బలమైన జట్టైనా కొన్ని సందర్భాల్లో తీవ్ర వైఫల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంగ్లండ్‌తో నాటింగ్‌హామ్‌లో జరిగిన మూడో టీ20లో భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌట్ కావడంతో టీ20 చరిత్రలో మరో చెత్త రికార్డు నమోదైంది. 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ పవర్‌ప్లేలోనే పెవిలియన్ చేరడంతో మ్యాచ్ పూర్తిగా ఇంగ్లండ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. చివరకు భారత్ 11.4 ఓవర్లలో 76 పరుగులకే ఆలౌట్ అయి 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఇది భారత్ రెండో అత్యల్ప స్కోరుగా నిలిచింది.

### టీ20ల్లో భారత్ అత్యల్ప స్కోర్లు:

**74 VS ఆస్ట్రేలియా (మెల్‌బోర్న్, 2008):**

టీ20 ప్రపంచకప్ గెలిచిన కొద్ది నెలల తర్వాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ కేవలం 74 పరుగులకే ఆలౌట్ అయింది. నాథన్ బ్రాకెన్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా బౌలర్లు భారత బ్యాటింగ్‌ను కుప్పకూల్చగా.. ఆతిథ్య జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

**76 vs ఇంగ్లండ్ (నాటింగ్‌హామ్, 2026):**

ఇంగ్లండ్‌తో మూడో టీ20లో టీమిండియా 76 పరుగులకే ఆలౌట్ కావడం భారత టీ20 చరిత్రలో రెండో అత్యల్ప స్కోరుగా నమోదైంది. ఈ ఓటమితో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 0-2తో వెనుకబడింది.

**79 vs న్యూజిలాండ్ (నాగ్‌పూర్, 2016):**

2016 టీ20 ప్రపంచకప్‌లో నాగ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్ నిర్దేశించిన 127 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 79 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ సాంట్నర్ (4 వికెట్లు), ఇష్ సోధి (3 వికెట్లు) భారత బ్యాటర్లను కట్టడి చేశారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు అత్యల్ప స్కోరులలో ఇదొకటి.

**81/8 vs శ్రీలంక (కొలంబో, 2021):**

2021లో శ్రీలంకతో జరిగిన మూడో టీ20లో భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 81 పరుగులే చేసింది. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్ 23 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం విశేషం. వనిందు హసరంగా నాలుగు వికెట్లు తీసి శ్రీలంక విజయంలో కీలక పాత్ర పోషించాడు.

**92 vs దక్షిణాఫ్రికా (కటక్, 2015):**

2015లో కటక్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో భారత్ 92 పరుగులకే ఆలౌట్ అయింది. కగిసో రబాడా, క్రిస్ మోరిస్ ధాటికి భారత టాప్ ఆర్డర్ కుప్పకూలింది. రోహిత్ శర్మ, సురేశ్ రైనా కలిసి చేసిన 44 పరుగులే జట్టుకు ప్రధాన ఆధారంగా నిలిచాయి. చివరకు భారత్ ఆ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీ20 ప్రపంచకప్ గెలిచిన కొద్ది నెలల్లోనే భారత బ్యాటింగ్ ఈ స్థాయిలో కుప్పకూలడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంది. వరుసగా కీలక వికెట్లు కోల్పోవడం, భారీ లక్ష్యాల ఛేదనలో ఒత్తిడిని తట్టుకోలేకపోవడం జట్టుకు ప్రధాన సమస్యగా మారింది.

# టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌పై దినేశ్ కార్తీక్ ఆగ్రహం

**లండన్, జూలై 8:** ఇంగ్లండ్ చేతిలో మూడో టీ20లో టీమిండియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన మార్పులే ఓటమికి ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. మ్యాచ్ సందర్భంగా ఓ స్పోర్ట్స్ ఛానల్ ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడిన కార్తీక్, శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణాను బ్యాటింగ్‌కు పంపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడమా? మీరు నన్ను ఆటపట్టిస్తున్నారా?" అంటూ లైవ్‌లోనే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టీ20ల్లో కుడి--ఎడమ చేతి బ్యాటర్ల కాంబినేషన్ కోసం ప్రయత్నించడం ఒక దశ వరకు సమంజసమేనని, కానీ అందుకోసం అనుభవజ్ఞుడైన శివమ్ దూబే కంటే ముందుగా హర్షిత్ రాణాను పంపడం సరైన నిర్ణయం కాదని కార్తీక్ వ్యాఖ్యానించారు. దేశీయ క్రికెట్‌లో కూడా హర్షిత్ రాణా పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన సందర్భాలు చాలా అరుదని ఆయన గుర్తుచేశారు. మూడో టీ20లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా 13 బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేయగా, అనంతరం క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే కూడా రెండు పరుగులకే ఔటయ్యాడు. దీంతో భారత బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలి, జట్టు కేవలం 76 పరుగులకే ఆలౌటైంది. ఇదిలా ఉండగా, టీమిండియా వరుస ఓటములపై సోషల్ మీడియాలో అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంలో తరచూ మార్పులు చేయడంపై మేనేజ్‌మెంట్‌ను అభిమానులు ప్రశ్నిస్తున్నారు. బ్యాటర్లలో ఎవరూ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడకపోవడం కూడా పరాజయానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంగ్లండ్ ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. సిరీస్‌ను సజీవంగా ఉంచుకోవాలంటే బ్రిస్టల్ వేదికగా గురువారం జరిగే నాలుగో టీ20లో భారత్ తప్పనిసరిగా విజయం సాధించాల్సి ఉంది.



# క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఎనిమిది జట్లు







**అట్లాంటా, జూలై 8:** ఫిఫా ప్రపంచకప్-2026 రౌండ్--16 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిశాయి. ఆఖరి నిమిషాల్లో నమోదైన గోల్స్, అనూహ్య ఫలితాలు, దిగ్గజ ఆటగాళ్ల భావోద్వేగ వీడ్కోళ్లతో ఈ దశ అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోసం జరుగుతున్న పోరు ఇప్పుడు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ దశలో అతిపెద్ద సంచలనంగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. న్యూజెర్సీలో జరిగిన మ్యాచ్‌లో నార్వే 2-1 తేడాతో బ్రెజిల్‌ను ఓడించింది. నార్వే స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలాండ్ రెండు గోల్స్ చేసి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈ ఓటమితో బ్రెజిల్ స్టార్ నెయ్మర్ తన చివరి ప్రపంచకప్‌ను నిరాశతో ముగించాడు. మరోవైపు పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ ప్రయాణం కూడా ముగిసింది. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి నిమిషంలో మైకెల్ మెరినో చేసిన గోల్‌తో పోర్చుగల్ 1-0 తేడాతో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా అద్భుత పునరాగమనంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2-0తో వెనుకబడిన అర్జెంటీనా, కెప్టెన్ లియోనెల్ మెస్సీ స్ఫూర్తిదాయక ఆటతో కేవలం 13 నిమిషాల్లో మూడు గోల్స్ చేసి 3-2తో సంచలన విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో మొరాకో కెనడాపై విజయం సాధించి చివరి ఎనిమిది జట్లలో చోటు దక్కించుకుంది. ఫ్రాన్స్ మాత్రం పరాగ్వేపై తీవ్ర పోరాటం అనంతరం కైలియన్ ఎంబాపే పెనాల్టీ గోల్‌తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. వివాదాల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో బెల్జియం అమెరికాను 4-1 తేడాతో చిత్తు చేసింది. కొలంబియాతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో స్విట్జర్లాండ్ పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఇప్పుడు ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్స్‌లో మిగిలిన ఎనిమిది జట్లు టైటిల్ కోసం హోరాహోరీ పోరుకు సిద్ధమయ్యాయి.

# సెమీఫైనల్లో సినర్, గాఫ్





లండన్: వింబుల్డన్‌లో టైటిల్ నిలబెట్టుకునే దిశగా సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినర్ ఆ క్రమంలో మరో అడుగు ముందుకేశాడు. పురుషుల సింగిల్స్‌లో ఈ టాప్ సీడ్ ఇటలీ స్టార్ 7-5, 7-6 (7/4), 6-3తో యాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)ను ఓడించి టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ జ్వెరెవ్ 6-4, 7-5, 3-6, 7-6 (8/6)తో జిరి లెహెక (చెక్)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు. మహిళల కోకో గాఫ్ (అమెరికా) 4-6, 6-3, 6-3తో తన దేశానికే చెందిన జెస్సికా పెగులాను ఓడించి లాస్ట్-4కు చేరుకుంది. మరో క్వార్టర్స్‌లో నవొమి ఒసాకా (జపాన్).. 6-7 (4/7), 4-6తో కరోలినా ముచోవా (చెక్) చేతిలో ఓడింది. ఈ టోర్నీలో సెమీస్‌కు చేరడం గాఫ్, ముచోవాకు ఇదే మొదటిసారి కావడం విశేషం.




# సెప్టెంబరులో 'ఓజీ 2' సందడి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ 2' చిత్రంపై సంగీత దర్శకుడు ఎస్. థమన్ ఆసక్తికరమైన సంకేతం ఇచ్చారు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించనున్న ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, థమన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. గత ఏడాది దసరా సందర్భంగా విడుదలైన 'ఓజీ' గ్యాంగ్‌స్టర్ యాక్షన్ చిత్రంగా ఘన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ సినీ జీవితంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ విజయంతోనే చిత్రబృందం 'ఓజీ 2'ను అధికారికంగా ప్రకటించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమాల వేదికగా 'ఓజీ' విశ్వాన్ని మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. దర్శకుడు సుజీత్‌తో మరోసారి కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని నిర్మాణ సంస్థ కూడా స్పష్టం చేసింది. దీంతో సీక్వెల్ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో జరిగిన 'హృదయం మురళి' సినిమా విడుదలకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న థమన్‌ను అభిమానులు "ఓజీ... ఓజీ..." అంటూ నినాదాలతో పలకరించారు. దీనికి స్పందించిన ఆయన "సెప్టెంబరులో కలుద్దాం" అని ఒక్క మాట చెప్పడంతో అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. థమన్ వ్యాఖ్యల నేపథ్యంలో సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 'ఓజీ 2' తొలి చూపు, ప్రచార వీడియో, శీర్షిక ప్రకటన లేదా మరో ప్రత్యేక సమాచారం విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ థమన్ వ్యాఖ్యలతో 'ఓజీ 2'పై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

# 'రాకా'లో అవకాశం కోల్పోయిన ప్రీతీ

స్టార్ హీరో అల్లు అర్జున్, బాలీవుడ్ నటి దీపికా పదుకోణె జంటగా దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం లిలి'రాకా'లిలిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అత్యాధునిక సాంకేతికత, భారీ నిర్మాణ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం గురించి వస్తున్న ప్రతి వార్త సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని దర్శకుడు అట్లీ వెల్లడించారు. యువ నటి ప్రీతీ ముకుందన్‌ను 'రాకా'లోని ఒక కీలక పాత్ర కోసం సంప్రదించినప్పటికీ, ఆమె బిజీ షెడ్యూల్ కారణంగా ఆ పాత్రను చేయలేకపోయారని అట్లీ తెలిపారు. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో ప్రీతీ ముకుందన్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అంతకుముందు 'కన్నప్ప' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. ప్రస్తుతం పలు భాషల్లో వరుస అవకాశాలతో ఆమె బిజీగా ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన 'ఇదయం మురళీ' సినిమా ప్రీ-రిలీజ్ కార్యక్రమంలో పాల్గొన్న అట్లీ మాట్లాడుతూ, ప్రీతీ ముకుందన్‌ను ఈ చిత్రంలో నటింపజేయాలని భావించామని, అయితే ఆమె ముందే ఇతర చిత్రాలకు అంగీకరించడంతో తేదీలు కుదరకపోయాయని వివరించారు. ప్రీతీ చేయాల్సిన పాత్రను చివరకు నటి ఫెమినా జార్జ్‌కు అప్పగించినట్లు అట్లీ వెల్లడించారు. దీంతో 'రాకా'లో ఫెమినా జార్జ్ ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అల్లు అర్జున్--అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రం కావడంతో 'రాకా'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. హై వోల్టేజ్ యాక్షన్, అత్యున్నత నిర్మాణ విలువలు, అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ సరసన దీపికా పదుకోణె నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. త్వరలోనే చిత్రీకరణకు సంబంధించిన తదుపరి వివరాలను చిత్రబృందం ప్రకటించే అవకాశం ఉంది.





# అప్పుడు మహేశ్‌బాబు స్టార్‌డమ్ గురించి తెలియదు

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ ' నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో? అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

# చదువుకోసమే ఛాన్స్ వదులుకున్నా

**నటి నాగ దుర్గ ఆసక్తికర వ్యాఖ్యలు**



ప్రస్తుతం 'ఇదుపు కాయితం' చిత్రంతో కథానాయికగా పరిచయం కానున్న నటి నాగ దుర్గ, ఒకప్పుడు స్టార్ హీరో నాని నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమాలో నటించే అవకాశాన్ని చదువు కోసం వదులుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల తమిళ చిత్రం 'లవ్ ఓ లవ్' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని పంచుకున్నారు. డిగ్రీ చదువుతో పాటు జర్నలిజం కోర్సు చేస్తున్న సమయంలో 'శ్యామ్ సింగరాయ్'లో సాయి పల్లవి స్నేహితురాలి పాత్రకు అవకాశం వచ్చిందని, అయితే పరీక్షలు ఉండటంతో ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని నాగ దుర్గ తెలిపారు. విద్య తన జీవితంలో ఎంతో ముఖ్యమని, అందుకే చదువుకు ఆటంకం కలిగించే సినిమా అవకాశాలను అంగీకరించలేదని చెప్పారు. ఇదొక్కటే కాకుండా మరికొన్ని అవకాశాలను కూడా ఇదే కారణంతో తిరస్కరించినట్లు వెల్లడించారు. కూచిపూడి నర్తకిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాగ దుర్గ, తర్వాత జానపద నృత్యం వైపు అడుగులు వేశానని తెలిపారు. ఫోక్ డ్యాన్స్ ద్వారా తనకు మరింత గుర్తింపు లభించిందని, సోషల్ మీడియా వల్ల జానపద కళలకు మంచి ఆదరణ పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం జానపద గీతాలు, నృత్యాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. సినిమాల ఎంపిక విషయంలో తాను ఒక ప్రత్యేక సూత్రాన్ని పాటిస్తానని నాగ దుర్గ తెలిపారు. ప్రతి సినిమా ప్రేక్షకులకు ఏదో ఒక మంచి సందేశాన్ని అందించేలా ఉండాలని భావిస్తానని చెప్పారు. తాను నటించిన 'కలివనం' మంచి సందేశంతో రూపొందిందని, ఇటీవల విడుదలైన 'ఇదుపు కాయితం' కూడా సమాజానికి ఉపయోగపడే అంశాన్ని చెప్పే చిత్రమని వెల్లడించారు. మంచి కథలు, విలువలతో కూడిన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తానని ఆమె స్పష్టం చేశారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com